


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక
ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 267 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం సోమవారం 3 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 267 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM MON 3 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా?

- రాష్ట్రంలో అరాచక పాలన పరాకాష్టకు చేరిందని జగన్ విమర్శ
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారని ఆగ్రహం
- సీదిరి అప్పలరాజు, ముస్తఫాలపై అక్రమ కేసులు బనాయించారని ధ్వజం
- ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చడానికే దాడులు, అరెస్టులని విమర్శ
- ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసిన జగన్



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, 'నారాసుర పాలన'లో అరాచకం పరాకాష్ఠకు చేరిందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దాడి చేసిన అధికార పార్టీ వారికి రక్షణ కల్పిస్తూ, బాధితులైన ప్రతిపక్ష నేతలపైనే హత్యాయత్నం వంటి తీవ్రమైన కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యమా, పోలీస్ రాజ్యమా లేక జంగిల్ రాజ్యమా అని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు.

ఆలూరు బీసీ ఎమ్మెల్యే విరూపాక్షిని అర్ధరాత్రి అరెస్ట్ చేసిన తీరుపై జగన్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. "ప్రజలెన్నుకున్న ఎమ్మెల్యే విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా? అర్ధరాత్రి 2:45 గంటలకు వందలాది పోలీసులతో ఇంటిపై దాడి చేసి, తలుపులు బద్దలుకొట్టి అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది?" అని జగన్ నిలదీశారు. చిప్పగిరి మండలం నేమకల్లులో టీడీపీ శ్రేణులు తమ పార్టీ నాయకుడి ఇంటిపై దాడి చేయగా, ప్రాణభయంతో ఆ కార్యకర్త ఎమ్మెల్యేకు ఫోన్ చేశాడని జగన్ వివరించారు. బాధితుడికి అండగా నిలబడటానికి వెళ్లిన ఎమ్మెల్యేపైనే టీడీపీ వారు రాళ్లతో దాడి చేశారని, ఈ ఘటనలో ఆయన సోదరుడు గాయపడ్డాడని తెలిపారు. వాస్తవానికి దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాల్సింది పోయి, బాధితుడైన ఎమ్మెల్యేపైనే హత్యాయత్నం కేసు నమోదు చేయడం దారుణమని అన్నారు. అర్ధరాత్రి పోలీసులు జరిపిన దౌర్జన్యం బయటకు రాకూడదనే భయంతోనే ఎమ్మెల్యే ఇంట్లోని సీసీటీవీ హార్డ్‌డిస్క్‌లను తీసుకెళ్లారని, సాక్ష్యాలను కాపాడాల్సిన పోలీసులతోనే సాక్ష్యాలను మాయం చేయిస్తున్నారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇదే తరహా రాజకీయ కక్ష సాధింపు

- మిగతా 2లో



## ఏపీలో తక్కువ ధరకే బియ్యం..

### అమ్మకాలు ప్రారంభించిన మంత్రి నాదెండ్ల

- సామాన్యులకు ఊరటనిస్తూ ప్రభుత్వ బియ్యం అమ్మకాలు
- విజయవాడలో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్
- రైతు బజార్లు, మిల్లుల్లో కేజీ రూ. 50, రూ. 52కే బియ్యం
- త్వరలో కందిపప్పు, పామాయిల్ కూడా తక్కువ ధరకే

- మిగతా 2లో

## వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్..

## కోర్టులో హాజరు

- ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షిని అరెస్ట్ చేసిన పోలీసులు
- టీడీపీ కార్యకర్త ఇంటిపై దాడి చేశారన్న ఆరోపణలు
- ఎమ్మెల్యేతో పాటు మరో 14 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు
- ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి ఎదుట నిందితుల హాజరు
- అక్రమ అరెస్ట్ అంటూ వైసీపీ ఆరోపణ.. ఖండించిన ప్రభుత్వం

- మిగతా 2లో





## ఇంటింటికీ టీడీపీ

### ఏడు రోజుల్లో 17.61 లక్షల ఇళ్లకు..

### ప్రభుత్వంపై విశ్వాసానికి నిదర్శనమన్న లోకేశ్

- ఏపీలో ఇంటింటికీ టీడీపీ
- 7 రోజుల్లో 17.61 లక్షల కుటుంబాలను కలిసిన కూటమి శ్రేణులు
- ఆదివారం సెలవు రోజైనా 3 లక్షలకు పైగా గృహాలను సందర్శించిన నేతలు
- టెలీకాన్ఫరెన్స్ ద్వారా పురోగతిని సమీక్షించిన రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- టెక్నాలజీతో కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన నారా లోకేశ్

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికీ టీడీపీ -- 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి--సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతోంది. ఏడో రోజైన ఆదివారం కూడా ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఏడు రోజుల్లో కూటమి శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 17,61,197 ఇళ్లను సందర్శించి, ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏ మాత్రం విరామం తీసుకోకుండా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏడో రోజు ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3,01,197 ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా, గత రెండేళ్లలో ప్రభుత్వం రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారదర్శక పాలన వంటి రంగాల్లో సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన ప్రయోజనాలను గణాంకాలతో

- మిగతా 2లో



## ఏపీ, ఆస్ట్రేలియా మధ్య 4 కీలక ఒప్పందాలు

- ఐఐటీ తిరుపతిలో సోలార్ తయారీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు
- విద్యార్థుల మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- మంత్రి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన ఫలితంగా కుదిరిన ఎంవోయూలు
- లోకేష్, ఆస్ట్రేలియా మంత్రి జూలియన్ హిల్ సమక్షంలో సంతకాలు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్, ఆస్ట్రేలియా మధ్య బంధం మరింత బలపడింది. క్లీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాల్లో సహకారాన్ని పెంచుకుంటూ ఇరుపక్షాలు నాలుగు వ్యూహాత్మక ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకు న్నాయి. ఉండవల్లిలో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, అభివృద్ధి సహాయ మంత్రి జూలియన్ హిల్ హాజరయ్యారు. ఇటీవల మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ పర్యటన సందర్భంగా అక్కడి సంస్థలతో జరిపిన చర్చలు, ఏపీలో పెట్టుబడులకు

- మిగతా 2లో

## గోదావరి ఉగ్రరూపం.. ఇంకా ముంపులోనే లంక గ్రామాలు

- గోదావరికి కొనసాగుతున్న వరద ఉధృతి
- కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాల్లో ముంపులో లంక గ్రామాలు
- పలు గ్రామాలకు నిలిచిపోయిన బోట్లు, రవాణా సౌకర్యాలు
- ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వశిష్ఠ, గౌతమి పాయలు
- అప్రమత్తమైన అధికారులు, కొనసాగుతున్న సహాయక చర్యలు

పెన్ పవర్ డెస్క్:ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. వరద పోటెత్తడంతో కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాలు వణికిపోతున్నాయి. స్థానికంగా వర్షాలు తగ్గుముఖం పట్టినా, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటకల నుంచి భారీగా వస్తున్న వరద నీటితో గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో లంక గ్రామాలు నీట మునిగి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కోనసీమ జిల్లాలోని అనేక లంక గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. ముమ్మిడివరం

- మిగతా 2లో





## వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం..

## యువతకు ప్రధాని మోదీ పిలుపు

- వికసిత భారత్ సంకల్ప అభియాన్‌లో భాగంగా 'నశా ముక్త్ యువ' ప్రారంభం
- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ యువతకు ప్రధాని మోదీ పిలుపు
- 2047 నాటికి వికసిత భారత్ సాధనకు ఆరోగ్యవంతమైన యువత అవసరమని స్పష్టీకరణ
- దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం క్రీడలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ
- గతేడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైనట్లు వెల్లడించిన ప్రధాని

- మిగతా 2లో



## రాజకీయాల్లోకి 'కాక్రోచ్ జనతా పార్టీ'?

### ఆగస్టు 5న కీలక నిర్ణయం

- రాజకీయ ప్రవేశంపై నిర్ణయం తీసుకోనున్న కాక్రోచ్ జనతా పార్టీ
- ఆగస్టు 5న అభిజీత్ దీప్కే నివాసంలో కీలక కోర్ కమిటీ సమావేశం
- నీట్ పేపర్ లీక్ నిరసనల విజయంతో ఉద్యమ సంస్థపై పెరిగిన అంచనాలు
- ఉద్యమంగానే కొనసాగాలా లేక పార్టీ పెట్టాలా అనే దానిపై స్పష్టత
- సమావేశం తర్వాత మీడియాకు వివరాలు వెల్లడించనున్న అభిజీత్ దీప్కే

- మిగతా 2లో

## హైడ్రాకు వెల్లువెత్తిన ప్రజా మద్దతు..

## కొనసాగించాలంటూ హైదరాబాదులో ర్యాలీలు



- హైడ్రాకు సంఘీభావం తెలుపుతూ నగరంలో పలు సంక్షేమ సంఘాల ర్యాలీలు
- వరద కట్టడి, చెరువుల పరిరక్షణ చర్యలను స్వాగతించిన నగరవాసులు
- రెండేళ్లలో రూ. 1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిందని ప్రశంసలు
- సోషల్ మీడియా దుష్ప్రచారాన్ని ఖండిస్తూ.. హైడ్రాను కొనసాగించాలని డిమాండ్
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కొనసాగించాలని విజ్ఞప్తి

- మిగతా 2లో

## పెరూలో ఘోర విమాన ప్రమాదం..

## 13 మంది టూరిస్టులు మృతి

పెన్ పవర్ డెస్క్: పెరూలో ఘోర విమాన ప్రమాద జరిగింది. నాజ్కా నగర సమీపంలో పర్యాటకులతో వెళ్తున్న విమానం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో 13 మంది మరణించినట్లు ఆ దేశ రవాణా, సమాచార మంత్రిత్వ శాఖ తెలిపింది. పెరూలోని ప్రసిద్ధ నాజ్కా లైన్స్‌ను సందర్శించేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాద

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం.. యువతకు ప్రధాని మోదీ పిలుపు

దేశ యువత మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారికి దూరంగా, శారీరకంగా, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే 'వికసిత భారత్' సంకల్పం నెరవేరుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో నేటి తరం యువత చూపిస్తున్న నిబద్ధత, సామాజిక స్పృహ తన నమ్మకాన్ని మరింత బలపరిచాయని ఆయన ప్రశంసించారు. నేడు 'నశా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రధాని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించి ప్రసంగించారు.దేశవ్యాప్తంగా యువతను ఏకతాటిపైకి తెచ్చి, మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. 'మై భారత్' వాలంటీర్ల నేతృత్వంలో ఇది ఒక ప్రజా భాగస్వామ్య (జన్ భాగీదారీ) ఉద్యమంగా రూపుదిద్దుకుంది. "మనం ఒక గొప్ప, ముఖ్యమైన సంకల్పం కోసం ఇక్కడ సమావేశమయ్యాం. ఈ కార్యక్రమం కేవలం ఒక వ్యక్తి, కుటుంబం లేదా సమాజం కోసం కాదు. ఇది దేశం కోసం. వికసిత భారత్ దిశగా దేశం అడుగులు వేస్తున్నప్పుడు, యువత డ్రగ్స్ సమస్యకు దూరంగా ఉండటం అత్యవసరం" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కాశీతో ఈ కార్యక్రమానికి ఉన్న అనుబంధాన్ని ప్రధాని గుర్తుచేసుకున్నారు. "కాశీ ఎంపీగా, ఈ కార్యక్రమం గతేడాది పవిత్ర కాశీ క్షేత్రంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం కావడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. దీనివల్ల ఈ కార్యక్రమానికి శాస్త్రీయ దృక్పథంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, సాధువుల ఆశీస్సులు, సాంస్కృతిక వారసత్వం కూడా తోడయ్యాయి" అని ఆయన అన్నారు. 2025 జులైలో వారణాసిలో జరిగిన యూత్ స్పిరిచ్యువల్ సమ్మిట్‌లో దేశంలోని 125 ఆధ్యాత్మిక సంస్థలు ఐదేళ్ల రోడ్‌మ్యాప్‌తో 'కాశీ డిక్లరేషన్'ను ఆమోదించాయని, వారంతా లక్షలాది పౌరులకు సేవ చేస్తున్నారని మోదీ వివరించారు.యువతను దేశానికి 'అమృత తరం' (అమృత్ పీఢి)గా అభివర్ణించిన ప్రధాని.. "రాబోయే 20-25 ఏళ్లలో మీ జీవితాలకు మీరే దిశానిర్దేశం చేసుకుంటారు. 2047 నాటికి వికసిత భారత్ సంకల్పాన్ని సాకారం చేసేది మీరే. ఆ విజయాన్ని సంపూర్ణంగా ఆస్వాదించేది కూడా మీరే. దేశానికి మీ శక్తి, సృజనాత్మకత, ప్రతిభ ఎంతో అవసరం. కాబట్టి దేశం కోసం, మీ సొంత జీవితాల కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండండి" అని పిలుపునిచ్చారు.ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా క్రీడా కార్యక్రమాలు, వాకథాన్‌లు, ధ్యాన శిబిరాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 'మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే యువతే వికసిత భారత్‌కు అసలైన బలం' అనే సందేశాన్ని దేశంలోని ప్రతి యువకుడికి చేర్చడమే ఈ ఉద్యమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# గోదావరి ఉగ్రరూపం.. ఇంకా ముంపులోనే లంక గ్రామాలు

- మొదటి పేజి తరువాయి

నియోజకవర్గంలోని లంక గ్రామాల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గోగులంక, గుత్తెనదీవి, కేసనకుర్రు వంటి ప్రాంతాల్లో బోట్ల సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు. తానేలంక - గురజాపులంక మధ్య రహదారిపై వరద నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. అప్పనపల్లి, ముక్తేశ్వరం, కనకాయలంక, అయ్యినవిల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక వంటి అనేక గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కొబ్బరి రైతులు తమ పంటను కాపాడుకునేందుకు ట్రాక్టర్ల సహాయంతో కాయలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.రాజమండ్రి వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో నదీ తీరం కోతకు గురవుతోంది. అధికారులు ఇసుక బస్తాలు వేసి కోతను అరికట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం చింతపల్లి వద్ద, గౌతమి పాయ ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. అయితే, గత రాత్రితో పోలిస్తే ప్రవాహం స్వల్పంగా తగ్గింది. భారీగా వస్తున్న వరద నీరు సముద్రంలోకి వెళుతోంది.మరోవైపు, ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే బాలరాజు, ఎస్పీ ప్రశాంత్ కిశోర్ పరిశీలించారు. అధికారులు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి, లంక గ్రామాల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నారు. కలెక్టర్ మహేశ్ కుమార్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, అధికారులకు తగిన సూచనలు జారీ చేస్తున్నారు. సహాయక చర్యలు ముమ్మరం చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.

# పెరూలో ఘోర విమాన ప్రమాదం.. 13 మంది టూరిస్టులు మృతి

- మొదటి పేజి తరువాయి

సమయంలో విమానంలో 11 మంది విదేశీ పర్యాటకులు ఇద్దరు సిబ్బంది ప్రయాణిస్తున్నారని.. ఈ ప్రమాదంలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదు. సమాచారం అందుకున్న వెంటనే రెస్క్యూ టీమ్స్ ఘటన స్థలంలో సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గురైన విమానాన్ని సెస్నా కారవాన్ జ-208 ఫ్లైట్?గా అధికారులు గుర్తించారు. ప్రత్యేక పర్యాటక విమానాలను నడిపే ఏరోడియానా అనే ఎయిర్ లైన్స్ కంపెనీ ఈ విమానాన్ని నడుపుతున్నట్లు పెరూ రవాణా, సమాచార మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇటలీ, జర్మన్, స్పానిష్?కు చెందిన 11 మంది ప్రయాణికులు, ఇద్దరు సిబ్బందితో నాజ్కా లైన్స్ విహారయాత్ర యాత్ర కోసం శనివారం (ఆగస్ట్ 1) మధ్యాహ్నం 12:10 గంటలకు పిస్కో విమానాశ్రయం నుంచి ఫ్లైట్ బయలుదేరింది.టేకాఫ్ అయిన నిమిషాల వ్యవధిలోనే ప్యూబ్లో నుయెవో జిల్లాలోని సోకోస్ సమీపంలో ఏటీసీతో విమానం సంబంధాలు కోల్పోయింది. ఆ తర్వాత కాసేపటికే నాజ్కా నగర సమీపంలో ఫ్లైట్ క్రాష్ అయ్యింది. ప్రమాదానికి గల కారణాన్ని నిర్ధారించడానికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్, ఏవియేషన్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ కమిషన్ దర్యాప్తు ప్రారంభించిందని అధికారులు తెలిపారు.

# ఏపీ, ఆస్ట్రేలియా మధ్య 4 కీలక ఒప్పందాలు

- మొదటి పేజి తరువాయి

ఇచ్చిన ఆహ్వానం ఫలితంగానే ఈ ఒప్పందాలు సాకారమయ్యాయి.

**1. ఐఐటీ తిరుపతిలో సోలార్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్**

మొదటి ఒప్పందం ప్రకారం, విశాఖలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (జశీజుజు), ఐఐటీ తిరుపతి, ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (ఖచీూఔ) కలిసి ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో 'సోలార్ తయారీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయనున్నాయి. దీని ద్వారా ఏపీని సోలార్ తయారీ, పరిశోధన, ఆవిష్కరణలకు జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడం లక్ష్యం. ఈ సెంటర్‌లో అధునాతన సోలార్ పీవీ తయారీ, ప్యానెళ్ల రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ వంటి అంశాలపై పరిశోధనలు జరుగుతాయి. సోలార్ సెల్ ఫిజిక్స్, మాన్యుఫ్యాక్చరింగ్, వాఫరింగ్ టెక్నాలజీస్ వంటి అంశాలపై కరిక్యులమ్, శిక్షణా కార్యక్రమాలను ఖచీూఔ రూపొందించి సహకారం అందిస్తుంది.

**2. సమ్మిళిత విద్య బలోపేతం కోసం**

రెండో ఒప్పందం సమ్మిళిత విద్యపై దృష్టి సారించింది. యూఎన్ఎస్‌డబ్ల్యూ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఏపీ సమగ్ర శిక్ష సంయుక్తంగా ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఆటిజం, ఇతర న్యూరోడైవర్స్ విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచడం దీని ముఖ్య ఉద్దేశం. స్పెషల్ ఎడ్యుకేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు, రాష్ట్ర విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా బోధనా వనరులను రూపొందిస్తారు.

**3. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై పైలట్ ప్రాజెక్ట్**

మూడో ఒప్పందంలో భాగంగా ఏపీ ఉన్నత విద్యా మండలి, ఆస్ట్రేలియాకు చెందిన రీబౌండ్ డింపుల్ ప్రైవేట్ లిమిటెడ్ కలిసి రాష్ట్రంలోని ఎంపిక చేసిన విద్యాసంస్థల్లో పైలట్ ప్రాజెక్టు చేపట్టనున్నాయి. విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణే దీని లక్ష్యం. ప్రత్యేకంగా రూపొందించిన వేదిక ద్వారా విద్యార్థులు తమ గోప్యతకు భంగం కలగకుండా మానసిక ఆరోగ్య సలహాలు, వర్చువల్ కౌన్సెలింగ్ సేవలను పొందవచ్చు. ఈ పైలట్ ప్రాజెక్టును ఉచితంగా అమలు చేయనున్నారు.

**4. నైపుణ్యాభివృద్ధికి డీఎల్ఎస్‌తో భాగస్వామ్యం**

నాలుగో ఒప్పందం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఙూూూణజ), ఆస్ట్రేలియాకు చెందిన డైనమిక్ లెర్నింగ్ సర్వీసెస్ (ఖూూ) మధ్య కుదిరింది. వృత్తి విద్య, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం కోసం ఇరు సంస్థలు కలిసి పనిచేస్తాయి. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా శిక్షణా కార్యక్రమాలను రూపొందించి, ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ అందించడం దీని ప్రధాన లక్ష్యం.ఈ ఒప్పందాలకు ముందు ఆస్ట్రేలియా ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయింది. ఏపీలో ఉన్న అవకాశాలను సీఎం వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ డా.సత్యనారాయణ్, చెన్నైలోని ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ సిలై జాకీ సహా పలువురు ఉన్నతాధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# హైడ్రాకు వెల్లువెత్తిన ప్రజా మద్దతు.. కొనసాగించాలంటూ హైదరాబాదులో ర్యాలీలు

హైదరాబాద్ నగరంలో వరద నివారణ, చెరువుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'హైడ్రా'కు ప్రజా మద్దతు వెల్లువెత్తింది. ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా, హైడ్రా పనితీరును ప్రశంసిస్తూ నగరంలోని పలు కాలనీల సంక్షేమ సంఘాలు ఆదివారం భారీ ర్యాలీలు నిర్వహించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేస్తూ, హైడ్రా కమిషనర్‌కు సంఘీభావం ప్రకటించాయి.అమీర్‌పేట, మధురా నగర్, శ్రీనివాసనగర్ పరిసర ప్రాంతాల్లో శ్రీనివాస నగర్ వెస్ట్, వెంగల్ రావు నగర్, మధుర నగర్ సహా పదుల సంఖ్యలో కాలనీ సంక్షేమ సంఘాలు ఈ ర్యాలీలలో పాల్గొన్నాయి. హైడ్రాపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ, ప్రభుత్వానికి తమ మద్దతును వీడియోల రూపంలో పంపించాయి.గత రెండేళ్లలో హైడ్రా సాధించిన విజయాలే ఈ మద్దతుకు కారణమని సంఘాల ప్రతినిధులు తెలిపారు. సుమారు 3325 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడటంతో పాటు, రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ఆస్తులను పరిరక్షించిందని వారు ప్రశంసించారు. రెండు విడతల్లో 20 చెరువులను పునరుద్ధరించి ఆయా ప్రాంతాల్లో వరద ముప్పును శాశ్వతంగా తొలగించడాన్ని నగర ప్రజలు కళ్లారా చూస్తున్నారని పేర్కొన్నారు.ఒకప్పుడు 5 సెంటీమీటర్ల వర్షానికే అమీర్‌పేట, పరిసర ప్రాంతాలు నీట మునిగేవని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో హైడ్రా రంగంలోకి దిగిందని స్థానికులు గుర్తుచేశారు. జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ వారం రోజుల్లోనే వరద సమస్యను పరిష్కరించిందని కొనియాడారు.కొంతమంది కబ్జాదారులు, వారికి సహకరించే నాయకులు తమ ఆటలు సాగకపోవడంతోనే సోషల్ మీడియాలో హైడ్రాపై బురద చల్లుతున్నారని వారు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ హైడ్రాను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలోనే ఈ కార్యక్రమాలు కొనసాగాలని నినాదాలు చేశారు.

ఇటీవల, హైడ్రా కమిషనర్ గా ఏవీ రంగనాథ్ ను తొలగించాలంటూ తెలంగాణ హైకోర్టు సంచలన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో, నేటి ప్రజా ర్యాలీలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# ఇంటింటికీ టీడీపీ ఏడు రోజుల్లో 17.61 లక్షల ఇళ్లకు.. ప్రభుత్వంపై విశ్వాసానికి నిదర్శనమన్న లోకేశ్

- మొదటి పేజి తరువాయి

సహా తెలియజేశారు.ఈ కార్యక్రమ పురోగతిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు. సెలవు రోజు కూడా కష్టపడి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు.

మరోవైపు, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ఈ కార్యక్రమాన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా కార్యక్రమ పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన సూచనలు చేస్తున్నారు. ఆదివారం కూడా విశేష ఉత్సాహంతో పాల్గొనడం, ప్రజల నుంచి వస్తున్న సానుకూల స్పందన చూస్తుంటే ప్రభుత్వంపై ఉన్న విశ్వాసం స్పష్టమవుతోందని లోకేశ్ అన్నారు. ఇదే ఉత్సాహంతో ప్రతి ఇంటికీ చేరుకుని ప్రభుత్వ పనితీరును వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఈ కార్యక్రమం నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

# వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్.. కోర్టులో హాజరు

కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. టీడీపీ కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై అధికార వైసీపీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే బి. విరూపాక్షిని, ఆయన కుమారుడు చంద్రశేఖర్‌ను పోలీసులు శనివారం అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు మరో 13 మందిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారందరినీ ఆదివారం ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట హాజరుపరిచారు.

**అసలేం జరిగింది?**

చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో శనివారం రాత్రి టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాడులు, దౌర్జన్యాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. టీడీపీ కార్యకర్త శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే విరూపాక్షితో సహా మొత్తం 15 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**పోలీసుల కథనం ప్రకారం..**

వైసీపీ నేత గిరి, టీడీపీ నేతలైన గురునాథ్, శివ, నాగరాజు మధ్య మొదలైన వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. గిరి ఫోన్ చేయడంతో ఎమ్మెల్యే విరూపాక్షి సుమారు 10 కార్ల కాన్వాయ్‌తో గ్రామానికి చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలోనే ఆయన అనుచరులు టీడీపీ నేత నాగరాజు ఇంట్లోకి చొరబడి దాడికి పాల్పడ్డారు. అడ్డుకోబోయిన మహిళ సుచిత్రపై కూడా చేయి చేసుకున్నారని, మరో నేత కొండా పురుషోత్తం కారును ధ్వంసం చేశారని పోలీసులు తెలిపారు. దళిత వ్యక్తి ఇంటిపై దాడి చేసి, ఆయన భార్యపై చేయి చేసుకున్న ఘటన కావడంతోనే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు వివరించారు.

**అక్రమ అరెస్ట్ అంటున్న వైసీపీ**

అయితే, ఈ అరెస్టును వైసీపీ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇది కక్షపూరితమైన, అక్రమ అరెస్ట్ అని ఆరోపించారు. తమ పార్టీ నేత గిరి ఇంటిపై టీడీపీ నాయకులే మొదట దాడికి ప్రయత్నించగా, ఎమ్మెల్యే విరూపాక్షి అక్కడికి విచారణకు వెళ్లారని తెలిపారు. ఆ సమయంలో టీడీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వడంతో ఎమ్మెల్యే సోదరుడు శ్రీరామకు గాయాలయ్యాయని చెప్పారు. తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు, అర్ధరాత్రి ఎమ్మెల్యేను, ఆయన కుమారుడిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఇంటిలోని సీసీటీవీ హార్డ్ డిస్క్‌లను కూడా పోలీసులు తీసుకెళ్లారని వారు పేర్కొన్నారు.

**ఫ్యాక్ట్ చెక్ తో బదులిచ్చిన ఏపీ ప్రభుత్వం**

ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అక్రమ అరెస్టు అంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యం అని ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేసింది. "ఎస్సీ వర్గానికి చెందిన ఒక వ్యక్తి ఇంటిపై దాడి చేసి అతని భార్య పై దౌర్జన్యం చేసి ఆమె వస్త్రాలు చించిన కేసులో ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు అయ్యారు. వాస్తవం ఏమిటంటే.. ఆలూరు నియోజకవర్గం, చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో ఒక పార్టీ నాయకుడు గిరి (యాదవ్), మరొక పార్టీ నాయకులైన గురునాథ్ (యాదవ్), శివ, నాగరాజు (ఎస్సీ మాదిగ) లను అసభ్య పదజాలంతో మాట్లాడారు. ఎందుకు అలా మాట్లాడావని నాగరాజు ప్రశ్నించినందుకు గిరి ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేయగా, ఆయన తన అనుచరులతో కలిసి సుమారు 10 కార్లలో అక్కడకు చేరుకున్నారు. వారు నాగరాజు ఇంటిలోకి దౌర్జన్యంగా చొరబడి, ఎమ్మెల్యే సమక్షంలోనే ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. ఈ దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన నాగరాజు భార్య సుచిత్రపై చేయిచేసుకుని ఆమె నైటీని చింపేశారు. అలాగే వారిని వారించబోయిన రాజశేఖర్, నాగరాజు అన్నపై కూడా విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ విషయం తెలుసుకుని పరామర్శించడానికి వచ్చిన స్థానిక నాయకుడు కొండా పురుషోత్తం కారును ధ్వంసం చేశారు. ఈ ఘటనలో గాయపడిన బాధితులను చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. జరిగింది ఇది కాగా అక్రమంగా పోలీసులు అరెస్టు చేసినట్లు ప్రచారం చేయడం సబబు కాదు" అని ఏపీ ఫ్యాక్ట్ చెక్ వివరించింది.కాగా, ఈ అరెస్టులతో ఆలూరు నియోజకవర్గంలో అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ మధ్య రాజకీయ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

# ఏపీలో తక్కువ ధరకే బియ్యం..

## అమ్మకాలు ప్రారంభించిన మంత్రి నాదెండ్ల

రాష్ట్రంలోని సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఊరట కల్పిస్తూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించేందుకు, తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 130 రైతు బజార్లు, 500 రైస్ మిల్లుల వద్ద ప్రత్యేక కౌంటర్ల ద్వారా సబ్సిడీ బియ్యం విక్రయాలను ఆదివారం ప్రారంభించింది. విజయవాడలోని ఏపీఐఐసీ రైతు బజార్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి, ప్రజలకు స్వయంగా బియ్యాన్ని అందజేశారు.ఈ పథకం కింద బీపీటీ సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ. 52కు, బీపీటీ రా రైస్‌ను కిలో రూ. 50కే విక్రయిస్తున్నారు. ఆధార్ కార్డు చూపించి ఒక వ్యక్తి 10 కిలోల వరకు బియ్యం కొనుగోలు చేయవచ్చు. బహిరంగ మార్కెట్‌లో రూ. 60 నుంచి రూ. 65 వరకు పలుకుతున్న ఈ రకం బియ్యాన్ని ప్రభుత్వం తక్కువ ధరకే అందుబాటులోకి తేవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి.ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. "ప్రజలకు కష్టం రాకముందే వారిని ఆదుకునే ప్రభుత్వం మాది. మార్కెట్‌లో బియ్యం ధరలను సమీక్షించి, సామాన్యుడిపై భారం పడకుండా తక్కువ ధరకే బియ్యం అందించాలని నిర్ణయించాం. మా విజ్ఞప్తికి రైస్ మిల్లర్లు సానుకూలంగా స్పందించి సహకరించడం అభినందనీయం" అని తెలిపారు. భవిష్యత్తులో కందిపప్పు, పామాయిల్‌ను కూడా తక్కువ ధరలకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన రావు, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ నూపుర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, జనసేన నేత అమ్మిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా?

- మొదటి పేజి తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోం దని జగన్ విమర్శించారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదాన్ని హత్య కేసుగా మార్చి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే షేక్ మహ్మద్ ముస్తఫా, ఆయన కుమారుడిపై కూడా వ్యాపార వివాదాన్ని అడ్డుపెట్టుకుని కిడ్నాప్ కేసు బనాయించారని, పోలీసులకు అప్పగించిన వ్యక్తిని కిడ్నాప్ చేశారని కేసు పెట్టడం ఎక్కడి న్యాయమని ప్రశ్నించారు.ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ అక్రమ అరెస్టులు, దాడులకు పాల్పడుతున్నారని జగన్ అన్నారు. డీఎస్సీ-2025 అక్రమాలపై సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఎందుకు రాజీనామా చేయడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.9,500 కోట్ల విద్యా, వసతి దీవెన బకాయిలు, నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.3 వేల భృతి హామీ ఏమైందని నిలదీశారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోందన్నారు. "అధికారం, పోలీసు బలం శాశ్వతం కాదు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అర్ధరాత్రి అరెస్టులు చేసినా వైసీపీ వెనక్కి తగ్గదు. బాధితులకు అండగా నిలుస్తూ అరాచక పాలనపై పోరాటం కొనసాగిస్తాం" అని జగన్ స్పష్టం చేశారు.

## రాజకీయాల్లోకి 'కాక్రోచ్ జనతా పార్టీ'?

ఆన్‌లైన్ వేదికగా యువతను సమీకరించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఇప్పుడు కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. రాజకీయాల్లోకి ప్రవేశించాలా, లేక ఉద్యమ సంస్థగానే కొనసాగాలా అనే అంశంపై ఆగస్టు 5న తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపకుడు, జెన్-జీ ఐకాన్‌గా గుర్తింపు పొందిన అభిజీత్ దీప్కే తన నివాసంలో కోర్ కమిటీ సభ్యులతో సమావేశం కానున్నారని విశ్వసనీయ వర్గాలు ఆదివారం తెలిపాయి.వివిధ రాష్ట్రాల్లోని మద్దతుదారుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయనున్నారు. సమావేశం ముగిసిన తర్వాత అభిజీత్ దీప్కే మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తారని పార్టీకి చెందిన ఒక ప్రతినిధి తెలిపారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిర్వహించిన నిరసన విజయవంతం కావడం, దాని ఫలితంగా అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఈ ఉద్యమ సంస్థపై అంచనాలు భారీగా పెరిగాయి.అయితే, విద్యార్థులు, యువత సమస్యలపై స్పందించే 'రెస్పాన్స్ గ్రూప్'గానే సీజేపీని కొనసాగిస్తామని అభిజీత్ గతంలోనే స్పష్టం చేశారు. శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతులకే కట్టుబడి ఉంటామని, ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా మారబోమని, ఏ పార్టీలోనూ విలీనం కాబోమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 5న జరిగే సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలను నిలబెట్టుకోవడం, విద్యా రంగంలో మార్పులకు చోదకశక్తిగా కొనసాగడం సీజేపీ ముందున్న అసలైన సవాలు అని విశ్లేషకులు భావిస్తున్నారు. సీజేపీ ఉద్యమం వెనుక బాహ్య శక్తుల పాత్ర ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అసంతృప్తి లేనిచోట ఇలాంటి ఉద్యమాలు పుట్టవని, కేవలం ఉన్న సమస్యలను విస్తృతం చేయగలవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సీజేపీ వేగంగా విస్తరించిన తీరు, సోషల్ మీడియాలో వారి ప్రచారం, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం వంటివి... గత రెండు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న నిరసన ఉద్యమాల నమూనాను ప్రతిబింబిస్తున్నాయని పరిశీలకులు పేర్కొంటున్నారు.

# ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి



ఆదివాసి సంఘాల డిమాండ్

**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 2:**ఆగస్టు 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ఆదివాసీల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణకు స్పష్టమైన చర్యలు చేపట్టాలని ఆదివాసి గిరిజన సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఆదివారం చింతూరు కేంద్రంలో ఆదివాసి గిరిజన సంఘం, ఆదివాసి జేఏసీ, ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఈ మేరకు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఆదివాసీల హక్కుల పరిరక్షణ, సమగ్ర అభివృద్ధి, వార్షిక ప్రణాళికల సమీక్షకు ఒక ముఖ్య వేదికగా గుర్తించబడిందని పేర్కొన్నారు. ప్రతి ఏడాది చింతూరు ఐటీడీఏ పరిధిలో ఆదివాసి దినోత్సవాన్ని సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీల భూ హక్కులను పరిరక్షించే 1/70 చట్ట సవరణకు సంబంధించి సుప్రీంకోర్టులో ఉన్న పిటిషన్లలో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయాలని, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్‌పై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏజెన్సీ ప్రాంత గ్రామాలు, విద్యాసంస్థల్లో రాజ్యాంగంలోని 5వ, 6వ షెడ్యూల్ ద్వారా ఆదివాసీలకు కల్పించిన హక్కులపై ఐటీడీఏల ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 9ను అధికారిక సెలవు దినంగా ప్రకటించి, ఆదివాసీలు తమ హక్కులను చాటిచెప్పే ప్రత్యేక దినంగా గుర్తించాలని కోరారు. గత ఏడాది ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా చింతూరు ఐటీడీఏ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని ప్రకటించిన ఆదివాసి అమరవీరుడు బిర్సా ముండా విగ్రహ ప్రతిష్ఠ ఇప్పటికీ పూర్తికాకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేసిన నాయకులు, ఈ ఏడాదిలోనే విగ్రహ ప్రతిష్ఠ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు సీసం సురేష్, ఆదివాసి జేఏసీ నాయకులు జల్లి నరేష్, ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు పోడియం లక్ష్మణ్, సోడే రాఘవ, ఉద్యోగ ఉపాధ్యాయ నాయకులు తిమ్మ సాయి, పండ కృష్ణయ్య, సోడే నారాయణ, సోడే మురళి, సవలం భద్రయ్య, పద్మావతి, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

## పాము కాటుతో వ్యక్తి మృతి



**జీలుగుమిల్లి, పెన్ పవర్ , ఆగస్టు 2 ;** జీలుగుమిల్లి గ్రామానికి చెందిన కె జోషి(60) ఆదివారం పాము కాటుతో మృతి చెందారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం సాయంత్రం ఇంటివద్ద పనిచేస్తూ ఉండగా పాముకాటుకు గురైనట్లు తెలిపారు. దేనితో కుటుంబ సభ్యులు జీలుగుమిల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు అప్పటికే చనిపోయినట్లు గుర్తించారు. గ్రామంలో అందరికీ సుపరిచితులు అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## వైకుంఠపురం వనదుర్గాదేవి ఆలయంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ప్రత్యేక పూజలు

**గంగవరం /రాజవొమ్మంగి , పెన్ పవర్, ఆగస్టు 2:**ఏజెన్సీ ముఖద్వారంగా ప్రసిద్ధి చెందిన ఏలేశ్వరం మండలం వైకుంఠపురంలోని వనదుర్గాదేవి ఆలయంలో రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెతో పాటు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్ కూడా ఆలయ దర్శనం చేసుకుని అమ్మవారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.

రాజవొమ్మంగి జనసేన మండల పార్టీ అధ్యక్షులు బొదిరెడ్డి త్రిమూర్తులు కుటుంబ సమేతంగా నిర్వహించిన ప్రత్యేక మొక్కుబడి కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వనదుర్గాదేవి ఆలయం భక్తుల కోరికలు తీర్చే మహిమాన్విత క్షేత్రమని, ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు ఇక్కడికి వచ్చి మొక్కులు తీర్చుకుంటారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రత్యేక పూజల అనంతరం త్రిమూర్తులు కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులతో కలిసి ఎమ్మెల్యే సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. ప్రశాంతమైన ప్రకృతి వాతావరణంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్నిస్తుందని ఆమె అన్నారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకుడు బీఎన్‌వీఎస్ గుప్తా నిర్వహించిన ఆధ్యాత్మిక, వినోదాత్మక క్విజ్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి గత రెండేళ్లలో సొంత నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై నిర్వహించిన క్విజ్ కూడా ఆసక్తికరంగా సాగింది.కార్యక్రమంలో ఏపీఐఐసి డైరెక్టర్, మండల పార్టీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, తెలుగుదేశం నాయకులు గణజాల తాతారావు, ఏఎంసీ డైరెక్టర్ కేశిరెడ్డి శివశంకర వరప్రసాద్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి గంగాధర్, జెట్టి మధు, ముప్పన సావిత్రి, ముప్పన మోహన్, చిట్టి సుబ్బారావు, వానపల్లి చిట్టిబాబు, బచ్చా బుజ్జి సత్యనారాయణ, చెక్కా లోవరాజు, చిలకచర్ల వీరబాబు, జనసేన నాయకులు కుర్ల రాజశేఖర్ రెడ్డి, పాపోలు శ్రీనివాసరావు, కుప్పాల జయరాం, సాయి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

## నవీన్,కుటుంబాన్నిఅన్నివిధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలి-టీడీపీపార్టీమండలనాయకులు



**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.2** మండలంలోని శ్రీరామగిరి,గ్రామానికిచెందిననాళ్లారపు నవీన్,(32) అనేయువకుడుగోదావరివరదల నేపథ్యంలోగృహములోఉన్నటువంటివస్తువు లను,సురక్షితమైన ప్రదేశాలకుతరలిస్తూఉండగా హుటాత్తున,గుండెపోటు రావడంతో,మృతిచెందడం జరిగింది.మృతిచెందిన,నవీన్,కుముగ్గురుపిల్లలు ఉన్నారు.వారిదినిరుపేద కుటుంబం,ఆకుటుంబానికి ప్రభుత్వం(ఎక్స్ గ్రేషియా)చెల్లించాలని,జెడ్.పి.టి.సి. సభ్యులు వాళ్ల రంగారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్,వైస్ ఎంపీపీ వడ్డాణపు భాగ్య లక్ష్మి,ఆదివారంతహసీల్దార్, స్పెషల్,ఆఫీసర్,సరస్వతికులిఖితపూర్వకంగాధరఖాస్తుఅందజేశారు.ఈ కార్యక్రమంలోపార్టీ ప్రధాన కార్యదర్శి పాయం రామా రావు,బీరకా సూర్య ప్రకాష్ రావు,బొర్రానరసింహారావు, వడ్డానపుసత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి, శబరి వరద ముప్పు తగ్గుముఖం

- **చింతూరు డివిజన్‌లో అన్ని వరద హెచ్చరికలు ఉపసంహరణ**
- **72 గ్రామాలు ప్రభావితం.. 2,124 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలింపు**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 2:**

పోలవరం జిల్లా చింతూరు డివిజన్‌లో గోదావరి, శబరి నదుల వరద ముప్పు తగ్గుముఖం పట్టడంతో జారీ చేసిన అన్ని వరద హెచ్చరికలను ఉపసంహరించుకున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 42.10 అడుగులకు తగ్గి ఫాలింగ్ ట్రెండ్‌లో కొనసాగుతుండగా, చింతూరు వద్ద శబరి నది 37.60 అడుగుల వద్ద ప్రవహిస్తూ తగ్గుముఖం పట్టిందన్నారు. ఆగస్టు 1న గోదావరి 56.10 అడుగుల గరిష్ఠ స్థాయిని నమోదు చేసినప్పటికీ ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉందని వెల్లడించారు.జూలై 31న జారీ చేసిన మొదటి, రెండో హెచ్చరికలతో పాటు ఆగస్టు 1న జారీ చేసిన మూడో హెచ్చరికను కూడా పూర్తిగా ఉపసంహరించినట్లు కలెక్టర్ తెలిపారు. అయితే ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

**72 గ్రామాలు ప్రభావితం**

వరదల కారణంగా చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఏటపాక మండలాల్లోని 72 గ్రామాలు ప్రభావితమయ్యాయని తెలిపారు. మొత్తం 12,449 కుటుంబాలకు చెందిన 32,183 మంది వరద ప్రభావానికి గురయ్యారని, 971 ఇళ్లు నీట మునిగాయని చెప్పారు. 750 కుటుంబాలకు చెందిన 2,124 మందిని సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించి అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు వివరించారు.

**విస్తృత సహాయక చర్యలు**

రోడ్డు సంబంధాలు తెగిపోయిన ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం 55 దేశీయ పడవలు, 26 రెస్క్యూ పడవలు, మూడు ట్రాక్టర్లు తదితర వాహనాలను వినియోగించి 15 గ్రామాలకు సహాయక బృందాలు చేరుకున్నాయని తెలిపారు. విద్యుత్ శాఖకు చెందిన 8,195 సేవలు వరదలతో ప్రభావితమవగా, ఇప్పటికే 4,780 సేవలను పునరుద్ధరించగా, మిగిలిన 3,415 సేవల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.

**వైద్య, తాగునీటి సదుపాయాలు**

149 మంది గర్భిణులను కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు తరలించి ప్రత్యేక వైద్య సేవలు అందించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు, విష నిరోధక ఔషధాలు, కుక్కకాటు టీకాలు సిద్ధంగా ఉంచామని చెప్పారు. ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు శాశ్వత జనరేటర్లు ఏర్పాటు చేయగా, పునరావాస కేంద్రాల్లో తాగునీటి ట్యాంకర్లు, నీటి ప్యాకెట్లు, చేతి పంపుల ద్వారా తాగునీటి సరఫరా కొనసాగిస్తున్నట్లు వివరించారు.

**24 గంటల కంట్రోల్ రూమ్**

చింతూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో 24 గంటల కమాండ్ కంట్రోల్ రూమ్ పనిచేస్తోందని, అత్యవసర పరిస్థితుల్లో 9490026397 నంబరును సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. నాలుగు మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో కూడా ప్రత్యేక నియంత్రణ గదులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, సబ్ కలెక్టర్ శుభం నొక్వల్ క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, కేంద్ర జల సంఘం (జఔజ), విపత్తు నిర్వహణ శాఖ సమాచారం ఆధారంగా ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు, సూచనలు అందిస్తున్నామని చెప్పారు.వరద నీటితో నిండిన రహదారులపై ప్రయాణించకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని, ప్రజల సహకారంతో వరద పరిస్థితిని విజయవంతంగా ఎదుర్కొన్నామని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.



# కైకరంలో ఆత్మీయంగా స్నేహితుల దినోత్సవ వేడుకలు





**పెన్ పవర్ ఉంగుటూరు, ఆగస్టు 02**

స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉంగుటూరు మండలం కైకరం గ్రామంలోని హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా సమావేశమై తమ స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్నేహితులందరూ కలిసి కేక్ కట్ చేసి, ఒకరికొకరు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. స్నేహానికి ప్రతీకగా పరస్పరం ఆలింగనం చేసుకుని ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం చిన్ననాటి పాఠశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనాటి సరదా సంఘటనలను పంచుకొని మధుర క్షణాలను ఆస్వాదించారు.

ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, పిల్లల విద్య, ఉద్యోగాలు, జీవితంలో సాధించిన పురోగతి గురించి వివరించగా, అందరూ పరస్పరం అభినందనలు తెలియజేశారు. ఇకపై ప్రతి సంవత్సరం ఇలాంటి సమావేశాలను నిర్వహిస్తూ ఒకరి కష్టసుఖాల్లో మరొకరు భాగస్వాములు కావాలని నిర్ణయించుకున్నారు. అలాగే "స్నేహానికి మించిన బంధం మరొకటి లేదు" అనే సందేశాన్ని ఏకగ్రీవంగా వ్యక్తం చేశారు.

ఎంతో కాలం తర్వాత కలుసుకున్న ఆనందంతో స్నేహితులంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ, జీవితాంతం ఈ స్నేహబంధాన్ని కొనసాగించాలని సంకల్పించి మధుర జ్ఞాపకాలతో కార్యక్రమాన్ని ముగించారు.

# వరద పునరుద్ధరణ పనుల నేపథ్యంలో నేటి పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ రద్దు

- **1100 టోల్ ఫ్రీ, 'మీకోసం' పోర్టల్ ద్వారా ఫిర్యాదులు స్వీకరణ**
- **సెప్టెంబర్ పీడీఎస్ కోటా ముందస్తు విడుదల**
- **కూనవరంలో నేడు వరద సమీక్ష సమావేశం**
- **జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 2:**పోలవరం జిల్లా చింతూరు డివిజన్ పరిధిలో గోదావరి వరదల అనంతరం కొనసాగుతున్న పునరావాసం, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ఆరోగ్య పరిరక్షణ వంటి అత్యవసర పనుల్లో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉన్న నేపథ్యంలో సోమవారం (ఆగస్టు 3) నిర్వహించాల్సిన జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం, రెవెన్యూ క్లినిక్‌ను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ పనులు అత్యవసర దశలో కొనసాగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, వినతులను ప్రభుత్వ 1100 టోల్ ఫ్రీ నంబర్ లేదా 'మీకోసం' పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే అర్జీలు సమర్పించుకునే అవకాశం ఉన్నందున ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందించేందుకు జిల్లా, మండల స్థాయి పీజీఆర్ఎస్ కేంద్రాల్లో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూ ఆర్ కోడ్ వ్యవస్థను అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సేవలు పొందిన అనంతరం ప్రజలు క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలు, సూచనలు నమోదు చేయాలని ఆయన కోరారు. ప్రజల స్పందన సేవల నాణ్యతను మెరుగుపర్చేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పోలవరం జిల్లాకు సెప్టెంబర్ నెల ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) కోటాను ముందస్తుగా విడుదల చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు సరుకులు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**నేడు వరద నిర్వహణ పునరుద్ధరణ చర్యలపై సమీక్ష**

విలీన మండలాల్లో వరద నిర్వహణ, పునరుద్ధరణ చర్యలపై జిల్లా స్థాయి అధికారులు, అనుబంధ శాఖల అధికారులతో సోమవారం (ఆగస్టు 3) ఉదయం 9 గంటలకు కూనవరం తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.





# కొనసాగుతున్న గోదావరి వరద ప్రవాహం





## బ్యారేజ్ వద్ద రెండో హెచ్చరిక అమలు

## మత్స్యకార కుటుంబాలుతరలింపు

## పద్మావతి ఘాటు వద్ద గట్టు బలహీనం

**రాజమహేంద్రవరం పెన్ పవర్,ఆగస్టు 2:**గోదావరి ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వద్ద నీటి మట్టం నీటి మట్టం పెరుగుతోంది. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం వరకు 5.00 గంటల రీడింగ్స్ ప్రకారం గేజ్ స్థాయి 14.80 అడుగులు, పాండ్ లెవల్ 14.96 మీటర్లుగా నమోదైంది. మూడు పంట కాలువలకు 8,900 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తుండగా, సముద్రంలోకి విడుదలవుతున్న మిగులు ప్రవాహం 14,25,866 క్యూసెక్కులుగా ఉంది.

ప్రస్తుతం బ్యారేజ్ వద్ద రెండో హెచ్చరిక అమల్లో ఉంది. నీటి మట్టం పెరుగుతున్న ధోరణి లోనే కొనసాగు తోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం తగ్గుముఖం పట్టింది. ఆదివారం సాయంత్రం ఐదు గంటల వరకు వరద ఉధృతి 51.5 అడుగుల నుంచి 51.0 అడుగులకు తగ్గడంతో 0.5 అడుగులు తగ్గింది. మీటర్లలో 0.27 మీటర్లు తగ్గింది. ప్రస్తుతం నీటి మట్టం ప్రమాద స్థాయి తగ్గుతున్న ధోరణిలో ఉంది.

భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రభావం క్రమంగా తగ్గుతోంది. అయితే దిగువ ప్రాంతాలపై ప్రభావం కొనసాగవచ్చునని అధికారులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

కాటన్ బ్యారేజ్ గోదావరి పరివాహక ప్రాంతాల వరద పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తు న్నారు. నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. పుష్కరాల రేపు వద్ద బ్రిడ్జి లంక లో ఉన్న మత్స్యకార కుటుంబాలను మున్సిపల్ మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు పోలీసుల రక్షణ చర్యల మధ్య ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. నగరంలోని పుష్కర ఘాట్లు వరద నీటిలో మునిగిపోయాయి. ఘాట్ల వద్ద నదిలోకి ప్రవేశించకుండా భారీ కేడ్లను ఏర్పాటు చేశారు. ప్రతి ఘాటు వద్ద పోలీసులనునియమించారుఇది ఇలా ఉండగా, పద్మావతి ఘాటు వద్ద రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు చేయడం వల్ల గట్టు బలహీన పడింది. దాంతో వరద ఉధృతికి గట్టు కొట్టుకుపోకుండా ఇరిగేషన్ మున్సిపల్ శాఖల అధికారులు సమన్వ యంతో ఇసుక బస్తలను రక్షణగా ఏర్పాటు చేశారు.




## రూ. 40 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆరోగ్య కేంద్రం ప్రారంభం

### మురమండ గ్రామంలో డోర్ టు డోర్ లో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం , పెన్ పవర్ ఆగస్టు 2:**కూటమి ప్రభుత్వ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందిస్తున్నామని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కడియం మండలం మురమండ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. 40 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన హెల్త్ వెల్నెస్ సెంటర్ ను ప్రారంభించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన పలు సి.సి రోడ్లు కు ప్రారంభోత్సవం చేసారు. "రెండేళ్ల నమ్మకం అభివృద్ధి-సంక్షేమం" డోర్ టు డోర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నూతన పింఛన్లు మంజూరు చేస్తామని తెలిపారు. రూ.40 లక్షలతో గ్రామంలో వెల్నెస్ సెంటర్ను ప్రారంభించామని, వైద్యులు కూడా ఉన్నారనీ వారి సేవలను సద్విని యోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం రెండేళ్ల సంక్షేమ విజయాల కరపత్రాలను పంపిణీ చేశారు. చేనేతల కమ్యూనిటీ హాల్ పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎం.పీ.పీ వెలుగుబంటి సత్య ప్రసాద్, మండల తెదేపా అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, వైస్ ఎంపీపీ పంతం గణపతి, ఏఎంసీ వైస్ చైర్మన్ బోడపాటి గోపి, అన్నదేవుల చంటి, జిల్లా ప్రత్తిపాటి రామారావు చౌదరి, దేవళ్ళ రామ్మోహన్ సొసైటీ చైర్మన్ వట్టికూటి జానకి రామయ్య (దత్తుడు), గట్టి సుబ్బారావు, ఎంపీడీవో రమేష్, ఎంఆర్ఓ శ్రీనివాస్, గన్ని రామారావు, బాబి, మిద్దె గోపి, ఇల్లపు హనుమంతు, నక్కా రాజు, మాజీ ఉప సర్పంచ్ చౌదరి, సిబ్బంది, డ్వాక్రా యానిమే టర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## అక్కమ్మ తల్లి ఆలయంలో పూజలు చేసిన రూరల్ ఎం ఎల్ ఏ గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 2:**రూరల్ మండలం సాటిలైట్ సిటీ గ్రామంలో వేంచేసియున్న శ్రీ శ్రీ శ్రీ గురజాల అక్కమ్మ తల్లి 35వ జాతర ఘనంగా మహోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితోపాటు ఎంఎస్ఆర్ శ్రీను, చౌడాడ లాజర్, బైరెత్తి సరోజినీ దేవి, గెద్దాడ కృష్ణ, పెంకె కోటేశ్వరరావు, తనుబుద్ధి సుబ్బయ్య, చౌడాడ సునీల్, బొమ్మ శ్రీను, రొంకాని రవి, పుచ్చ గోవింద్, ఉమా మహేష్, అలంకార శ్రీను తదితరులు ఉన్నారు.

## అక్కమ్మ తల్లి ఆలయ మహోత్సవం లో పాల్గొన్న చందన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 2:**రూరల్ నియోజకవర్గం మండలం శాటిలైట్ సిటీ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గురజాల అక్కమ్మ తల్లి ఆలయ 35వ మహోత్సవం ఘనంగా జరుగుతోంది. ఈ మహోత్సవంలో మాజీ రాష్ట్ర పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి చందన నాగేశ్వర్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహ కులు చందన నాగేశ్వర్ ను ఆహ్వానించి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు

## నారాయణపురంలో ఆషాడ సారె కోసం మహిళల భక్తి ఊరేగింపు



**పెన్ పవర్ -- ఉంగుటూరుఆగస్టు 02**నారాయణపురం గ్రామంలోని శ్రీ కోట్లమ్మ అమ్మవారికి ఆషాడ సారె సమర్పించేందుకు ఆదివారం మహిళలు భారీ సంఖ్యలో భక్తి ఊరేగింపు నిర్వహించారు.

ఏకరూప చీరలు ధరించిన మహిళలు చలివిడి, స్వీట్లు, ఇతర నైవేద్యాలతో పాటు మంగళ వాయిద్యాల నడుమ, బాణాసంచా కాల్పుల మధ్య గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి కోట్లమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు.

అనంతరం స్థానిక శ్రీ కోదండరామాలయం వద్ద మహిళలు భక్తి ప్రదర్శన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరగగా, కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి




**రాజమహేంద్రవరం, పెన్ పవర్,ఆగస్టు 2:**ఆర్యవైశ్య మహాసభ వాణిజ్య విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ నల్లమిల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం పలు సామాజిక, విద్యా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ శ్రీ అకాడమీ రెండవ శాఖను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, చక్కగా విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకుని దేశానికి కీర్తి తీసుకు రావాలని ఆకాంక్షించారు. అనంతరం నల్లమిల్లి సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో పాటు ట్రాఫిక్ నిబంధనలను పాటించా లని ఉపాధ్యాయులను గౌరవించాలనిసూచించారు. స్తానిక వంకాయలవారి వీధిలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో చిన్ని రామ సత్యనారాయణ పాల్గొని సుమారు 6,000 మంది భక్తులకు అన్నప్రసాదాన్ని ప్రారంభించారు. నగర ప్రముఖులు ఆయనను ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమాల్లో గ్రంధి రాజా, నూలి బుజ్జి , అప్పన వెంకటేశ్వరరావు, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## క్వారీ ప్రాంతంలో రూ. 25 కోట్లతో పనులు..

- 49వ డివిజన్లో 'మన వార్డులో - మన ఆదిరెడ్డి'



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 2 :**క్వారీ ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిదని, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అమృత్--2.0 పథకంలో రూ.95 కోట్ల వ్యయంతో సమగ్ర నీటి సరఫరా ప్రాజెక్టును అమలు చేస్తున్నామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. 49, 50 డివిజన్లకు సంబంధించి 'మన వార్డులో -- మన ఆదిరెడ్డి' కార్యక్రమంలో ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ, 49వ డివిజన్లో గత రెండేళ్లో రూ.1.10 కోట్ల అభివృద్ధి పనులు పూర్తిచేశామని, ప్రస్తుతం రూ.22 లక్షల పనులు జరుగుతున్నాయని, మరో రూ.20 లక్షల పనులతో పాటు, మొత్తం రూ.1.50 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరిగాయన్నారు. పుష్కరాలకు రూ.20 కోట్ల పనులు మంజూర య్యాయని తెలిపారు. 50వ డివిజన్లో గత రెండేళ్లలో రూ.3.50 కోట్ల అభివృద్ధి పనులు పూర్తిచేశామని, ప్రస్తుతం రూ.1 కోటి పనులతో పాటు మరో రూ.30 లక్షల పనులు ప్రారంభం కానున్నాయని, పుష్కరాల కోసం రూ.4 కోట్ల పనులు మంజూర య్యాయన్నారు. క్వారీ ప్రాంతంలోని 45, 46, 47, 48, 49, 50 వార్డుల్లో దశాబ్దాలుగా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా అమృత్-2.0 కింద రూ.95 కోట్ల ప్రాజెక్టు పనులు కొనసాగు తున్నాయని తెలిపారు. కోటిలింగాల రేవు వద్ద 20 ఎంఎల్డీ నీటి శుద్ధి కేంద్రం, సారంగధర మెట్ట వద్ద అదనపు నిల్వ ట్యాంకులు, కొత్త పైప్లైన్లు నిర్మిస్తున్నా మన్నారు. పెట్రోల్ బంకు వద్ద త్రీటౌన్ పోలీస్ అవుట్పోస్ట్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. 49వ డివిజన్లోనే 11 ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. పేటలో తాను రూ.10 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్, సింహాచలనగర్లో మహిళల పార్కు నిర్మిస్తున్నామని తెలిపారు. అనంతరం 49వ డివిజన్ ఇన్చార్జ్ దుత్తరపు గంగాధర్ నివాసంలో ఎమ్మెల్యే వాసు రాత్రి బస చేసారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వరద ప్రాంతాల్లో జాయింట్ కలెక్టర్ పర్యటన

- 2 నెలల బియ్యం,దోమతెరల పంపిణీ



**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు2.** గోదావరి వరదల నేపథ్యంలో పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ ప్రశాంత్,చింతూరు ఐటీడీఏ పిఓ శుభం నోఖ్వాల్ ఆదివారం నాడు కూనవరం,విఆర్.పురం వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటించారు.కూనవరం మండలంలోని పంద్రాజుపల్లి చౌక దుకాణంలో ఆగస్టు నెలతో పాటు సెప్టెంబర్ నెల ముందస్తు బియ్యం పంపిణీని పరిశీలించారు. పునరావాస కేంద్రాలకు గ్రామాల నుండి తరలించిన బాధితులకు కల్పిస్తున్న వసతి,భోజనం, తాగునీరు,ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించారు.గత ఏడాది కంట్రీ బోటు చార్జీల బకాయిల్లో సగం మొత్తాన్ని రేపటి మధ్యాహ్నంలోగా చెల్లిస్తామని జెసి హామీ ఇచ్చారు. పోలవరం గృహాలు,పిడిఎఫ్ కేసులు,గత ఏడాది వరద సహాయం,25 కేజీ అదనపు బియ్యంపై డిసెంబర్ 2026 నాటికి చర్యలు తీసుకుంటామని పిఓ తెలిపారు.వరద తగ్గిన వెంటనే పారిశు ధ్యం,బ్లీచింగ్,ఫాగింగ్, తాగునీటి శుద్ధి చేపట్టాలని అధికారులు చెప్పారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు నాగమల్లేశ్వరరావు,ఎస్డిసి బాలకృష్ణారెడ్డి,వెంకటేశ్వర్లు, ఆంజనేయులు,తహసీల్దార్ ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జీలుగుమిల్లి మండలంలో పులి సంచారం



**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఆగస్టు 2;** స్వర్ణ వారి గూడెం, తాడువాయి, సల్లవారిగూడెం పరిసర ప్రాంతాలలో పులి సంచరిస్తూ ఉందని జంగారెడ్డిగూడెం డిఆర్ఓ పి ధర్మారావు తెలిపారు. ఆదివారం స్వర్ణ వారి గూడెం గ్రామానికి చెందిన రైతు రాజేంద్ర గేదె పై పులి దాడి చేసి చంపి వేసిందని తెలిపారు. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పొలాలలో వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలి అని అన్నారు. పులి ఆనవాళ్లు కనిపించిన, పులి కనిపించిన దగ్గరకు వెళ్లకుండా అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పెద్దపులి సంచారం ఎక్కడెక్కడో తిరుగుతూ ఉందని పత్రికల్లో తెలుసుకునే వాళ్ళం ఇప్పుడు జీలుగుమిల్లి మండలంలోకి రావడంతో ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారు. ఎప్పుడు ఎక్కడ ప్రత్యక్షమవుతుందోనని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు .అటవీశాఖ అధికారులు పెద్ద పులి నీ పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.ద

## ఏలూరు ఎంపీ తో గడ్డ మణుగు



**జిలుగుమిల్లి ,పెన్ పవర్ ,ఆగస్టు 2** ; జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు అని జనసేన పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పిటిసి, ద్వారకాతిరుమల శ్రీ చిన్న వెంకన్న దేవస్థానం ధర్మకర్త మండలి ప్రత్యేక ఆహ్వానితులు గడ్డమణుగు రవికుమార్ తెలిపారు. ఆదివారం జంగారెడ్డిగూడెం జడ్పీ హైస్కూల్లో పింగళి వెంకయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సుమారు రెండు కిలోమీటర్లు పొడవైన జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించి దేశభక్తిని మరింత పెంపొందించేలా సాగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కరాటం రాంబాబు, జనసేన నాయకులు కరాటం సాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శాంతించిన గోదావరి

- 3వ ప్రమాద హెచ్చరిక ఎత్తివేత






**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు 2.** గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గోదారమ్మ ఉగ్రరూపం దాల్చి గ్రామాలను ముంచివేసింది.భద్రాచలం వద్ద 3వ ప్రమాద హెచ్చరిక దాటి 56 అడుగుల వద్ద ప్రవహించింది. ముంపుకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి తాసిల్దార్ ధర్మేందర్, డిప్యూటీ ఎంపీడీవో జగన్నాధ రావు,స్థానిక ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు.అధికారుల చర్యలతో ఎటువంటి ప్రాణనష్టం,ఆస్తి నష్టం జరగలేదు.పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి ఎస్డిసి బాలకృష్ణారెడ్డి దోమతెరను అందించారు. భద్రాచలం వద్ద 56 అడుగుల వద్ద ప్రవహించిన గోదావరి ఆదివారం రాత్రి 7 గంటలకు 42.10 అడుగులకు తగ్గడంతో 2వ ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. అదేవిధంగా కూనవరం వద్ద ఉదయం 7గంటలకు 52.70 అడుగుల వద్ద ప్రవహించిన గోదావరి,రాత్రి 7 గంటలకు 48 అడుగులకు తగ్గడంతో స్థానిక ప్రజలు,అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## సిరిగిందలపాడులో రామకృష్ణ మిషన్ ఉచిత వైద్య శిబిరం





**150 మందికి వైద్య సేవలు..**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 2:**రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల, రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ఆదివారం రంపచోడవరం మండలంలోని సిరిగిందలపాడు గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ తెలిపారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో సుమారు 150 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. గుండె వ్యాధుల నిపుణులు డాక్టర్ పోతుల రామారావు, డాక్టర్ శ్రీనివాస్ రాయుడు, డాక్టర్ దాసరి ఉమా మహేష్, డాక్టర్ పావని ప్రియ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించారు. శిబిరంలో 60 మందికి రక్తపరీక్షలు, 8 మందికి థైరాయిడ్ పరీక్షలు, 4 మందికి ఈసీజీ పరీక్షలు, 20 మందికి ఫిజియోథెరపీ సేవలు అందించినట్లు స్వామి పరిజ్ఞేయానందజీ తెలిపారు. రోగులు, వారి సహాయకులకు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ వ్యాధుల నివారణ, నియంత్రణపై వైద్యులు అవగాహన కల్పించారు. అలాగే వర్షాకాలంలో వచ్చే అంటువ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ సిబ్బంది, వైద్య సేవల సమన్వయకర్త కానుమోను శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ యర్రా వెంకట రామకృష్ణ (బాలాజీ శ్రీను), వాలంటీర్ చిన్నం ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రెండు తెలుగు రాష్ట్రాలు నీటి హక్కులను కాపాడుకోవాలి



- కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి
- బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ను (కె డబ్ల్యు టి-2) వ్యతిరేకించాలి
- మీడియా సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్ట్ 2**

అంతరాష్ట్ర నదీ జలాల కేటాయింపుల్లో భాగంగా 1976 లో బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ రాష్ట్రాల వారీగా కేటాయింపులో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన నదీ జలాల వాటాను కాపాడుకోవడంలో రెండు తెలుగు రాష్ట్రాలు కలిసి పనిచేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

గత 50 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ చుట్టుపక్కల రాష్ట్రాలతో జలవివాదాలు నడుస్తున్నాయని వీటి పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధి చూపించకపోవడంతో వివాదాలు మరింత సంక్లిష్టమవుతున్నాయని అన్నారు. స్థానిక బిజెపి కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విభజన ఆంధ్రప్రదేశ్ అనంతరం పోలవరం ప్రాజెక్టు బహుళార్థ సాధక ప్రాజెక్టుగా రూపొందాలంటే ఒరిస్సా, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాలలో భూ సమీకరణ కచ్చితంగా చేయాలన్నారు. అవసరమైతే ఐదు రెట్లు నష్టపరహారం చెల్లించైనా భూసేకణను జరపాలని కేంద్రంపై ప్రభుత్వ రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. గోదావరి, కృష్ణా నీటి ప్రాజెక్టులకు సంబంధించి అంతర రాష్ట్ర సమస్యలు, అంశాలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఒరిస్సా, ఛత్తీస్గఢ్ భూములు ఇంకా సేకరించలేదని రాష్ట్ర ప్రభుత్వం వారిని సంప్రదిం చాల్సిన అవసరం ఉందన్నారు. ఒరిస్సాలో 8 గ్రామాలు , ఛత్తీస్గఢ్ లో 4 గ్రామాలు భూమి, వేల ఇండ్లు మునిగి పోతాయన్నారు. వారికి కేంద్రం నష్టపరిహారం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. నష్టపరిహారం అంశం కేంద్ర ప్రభుత్వం పునర్విభజన చట్టం 94 సెక్షన్లో పొందుపరి చిందన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి అయినా ఒరిస్సా, ఛత్తీస్గర్ తో ఒప్పందం కుదరకపోతే నీరు నిల్వ ఉంచడానికి కుదరదన్నారు. పోలవరం పూర్తి అయిన తరువాత 80 టీఎంసీ లు కృష్ణ కు తరలించి 20 టీఎంసీ లు కర్ణాటక కు, మరో 14 టీఎంసీలు మహారాష్ట్ర కు ఇవ్వాలని బచావత్ ట్రిబ్యునల్ లో పొందుపరి చారన్నారు. ట్రిబ్యునల్ లో ఉన్న నీటి హక్కులు పొందాలని, రైతులకు న్యాయం చెయ్యాలన్నారు.

రైతుల పక్షన ఏపీ ప్రభుత్వం నిలవాలని, ఈ సమస్య పార్టీలది కాదని ప్రభుత్వాల మధ్య అన్నారు.

కృష్ణ నది నీరు పూర్తిగా ఏపీ కి వచ్చేటట్టు చర్యలు తీసుకోవాలని, పోలవరం ప్రాజెక్ట్ త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై ఆయా రాష్ట్రాల ముఖ్య మంత్రులు న్యాయపర హక్కుల సాధన కోసం సంప్రదింపులు జరుపుకోవాలన్నారు.

రాష్ట్ర రైతుల ప్రయోజనాల కోసం రెండుసార్లు చంద్రబాబును కలిశానన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు ప్రభుత్వం పై తేవాలన్నారు బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఆర్డర్లో చివర రాష్ట్రం మిగులు జలాలు వినియోగించుకుని హక్కు ఆంధ్రప్రదేశ్కు ఉందని స్పష్టంగా చెప్పిందన్నారు. రెండోసారి ఏర్పాటైన ట్రిబ్యునల్ లో కరువు పరిస్థితులు ఏర్పడితే ఆంధ్రప్రదేశ్ కు నష్టం జరుగుతుందన్నారు. కర్ణాటక ఆల్మట్టి డ్యాం ఎత్తు మంచి 519 నుంచి 524 ఎత్తు పెంచడానికి అనుమతిస్తే 150 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్ నష్టపోవాల్సి వస్తుందన్నారు. బ్రిజేష్ కుమార్ ఆంధ్రప్రదేశ్ హక్కులకు మొదటి నుంచి భంగం కలిగిస్తున్నారని అశాస్త్రయంగా నీటి జలాలను విభజించారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కు జరిగిన అన్యాయంపై తాను సుప్రీంకోర్టులో 2011లో కేసు వేసి స్టే ఆర్డర్ తెచ్చానని అది ఇప్పటికి కొనసాగుతుందన్నారు.

ఉన్న ఆర్డర్స్ నీ కాపాడు కుంటే సరిపోతుం దన్నారు.

పోలవరం ఫుల్ లెవెల్ పూర్తి కావాలంటే భూ సేకరణ జరిగి తీరాలన్నారు. పై రాష్ట్రాల కూడా మేలు చేస్తుందన్నారు .ఆ రెండు రాష్ట్రాల్లో బిజెపి అధికా రంలో ఉందని, కేంద్ర ప్రభుత్వం తో సంప్రదించా లన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బిజెపి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బిజెపి నాయకులు బొమ్మల దత్తు, అడబాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## కూటమి పార్టీల విభేదాలు వచ్చే స్థానిక ఎన్నికల పై ప్రభావం పడతాయా ?

**పేపర్ మిల్లు ఎన్నికల్లో బయట పడిన విభేదాలు**

**యాజమాన్యానికి బలం చేకూర్చిన ఎన్నికలు**

**క్యాడర్లో ఆందోళన ?**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 2:**

నగరంలో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఆంధ్ర ప్రదేశ్ పేపర్ మిల్లు ఎన్నికలు కూటమి పార్టీల్లోని అనైక్యత, అంతర్గత విభేదాలు వర్గ రాజకీయాలు బట్ట బయలడడంతో ఆ పార్టీల నాయకులతో పాటు కేడరును ఆందోళన గురిచేసింది. గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రధానంగా తెలుగుదేశం పార్టీ , జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడి వైసిపి పార్టీ ని మట్టి కరిపించి అధికారం లోకి రావడం తెలిసిందే. రెండేళ్లుగా కుటమిలోని ఉన్న మూడు పార్టీల నాయకుల మధ్య, క్యాడర్ మధ్య విభేదాలు నెలకొన్నాయని వస్తున్న వాదనలకు బలం చేకూర్చులా మిల్లు ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేయడం నాయకుల మధ్య వర్గపోరు ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అయితే అధిష్టానాల స్థాయిలో తమ మధ్య విభేదాలు లేవని, అదేవిధంగా క్రింది స్థాయిల్లోను నాయకుల మధ్య విభేదాలు వద్దని , ప్రభుత్వ, పార్టీల కార్యక్ర మాల్లో కలుపుకుని పోవాలని ఆయాపార్టీల అధిష్టానాలు ఆదేశించడం తెలిసిందే. అయితే క్షేత్రస్థాయిలో ఈ ఆదేశాలతో తమకు సంబంధం లేనట్టుగా వర్గాలే ప్రధానం అన్నట్టుగా ఇటీవల జరిగిన పేపర్ మిల్లు కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో కూటమి పార్టీల అనుబంధ కార్మిక సంఘాలు ( ట్రేడ్ యూనియన్లు) విడివిడిగా పోటీ చేయడం వాటిమధ్య ఉన్న అనైక్యతకు, ధిక్కార స్వరానికి అర్థంపడు తున్నాయి. అంతే కాకుండా, కూటమి పార్టీలతో సంబంధం లేని ప్రత్యర్థి పార్టీల అనుబంధ కార్మిక సంఘాలతో కలిసి పోటీ చేయడం నగర ప్రజానికంలో మరింత విస్మయాన్ని కలిగించింది. ఇంతవరకు భావిస్తూ వస్తున్న కుటమి పార్టీల మధ్య ఐక్యత లేదన్నది బట్ట బయలయింది. వామపక్ష పార్టీలకు చెందిన ఏ ఐ టి యు సి, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్, కార్మిక సంఘాలతో జనసేన ట్రేడ్ యూనియన్ కలిసి పోటీ చేసింది. ఈ ఎన్నికల్లో జనసేన యూనియన్ కు 258 ఓట్లు వచ్చి మొదటి స్థానం లో నిలిచింది. ప్రతిపక్ష వైసీపీ ట్రేడ్ యూనియన్ తో సి పి ఎం సిఐటియు, బిజెపి చెందిన భారతీయ మజ్దూర్ సంఘం, కాంగ్రెస్ ఐఎన్టీయూసీ కలిసి పోటీ చేశాయి. ఈ యూనియన్ కు 228 ఓట్లతో రెండవ స్థానంలో నిలిచింది.

అధికార తెలుగుదేశం పార్టీ అనుబంధ టి ఎన్ టి యు సి కొన్ని చిన్న సంఘాలతో కలిసి విడిగాపోటీ చేసింది. ఈ యూనియన్ కు 220 ఓట్లు వచ్చి మూడో స్థానంలో నిలిచింది. ఈ యూనియన్ తరపున అధికార పార్టీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావులు, కేడర్ మద్దతుగా నిలిచి విస్తృత ప్రచారం నిర్వహించి నప్పటికీ మూడవ స్థానం రావడం పట్ల అధికార పార్టీ తెలుగుదేశం క్యాడర్ జీర్ణించుకోలేకపోతోంది. పైగా గత రెండేళ్లుగా అధికార పార్టీ ఎమ్మెల్యే సాగిస్తున్న వంటి వంటేద్దు పోకడ కూడా ఒక కారణమని కార్మిక వర్గంలో అసహనం నెలకొందని తెలుస్తోంది. నగర జనసేన పార్టీకి చెందిన అత్తి సత్యనారాయణ, వై శ్రీనివాసు, ఆదిరెడ్డి శ్రీనివాస్ లకు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ లతో సత్సంబంధాలున్నాయి. కూటమి పార్టీలోని జనసేన , బీజేపీ పార్టీల అనుబంధ సంఘాలతో సమన్వయం సాధించకపోవడం అధికార పార్టీ వైఫల్యంగా పలువురు భావిస్తున్నారు. ప్రతిపక్ష వైసిపి, కాంగ్రెస్, బిజెపి అనుబంధ కార్మిక సంఘాలు కలిసి పోటీ చేయడం కూడా ఆ పార్టీల నైతిక విలువలను ప్రశ్నిస్తు న్నాయి. యాజమాన్యానికి

మేలు చేశాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా లు అభిప్రాయపడడం గమనార్హం.

**కూటమి విభేదాలు వచ్చే స్థానిక ఎన్నికల పై ప్రభావం ?**

కూటమి పార్టీల విభేదాలు వచ్చే స్థానిక ఎన్నికల పై ప్రభావం పడతాయా అని అధికార పార్టీ కేడర్ ఆందోళన చెందుతోంది. సమగ్ర ఓటర్ల జాబితా ముగిసిన వెంటనే సెప్టెంబర్ నెలలో స్థానిక ఎన్నికలు జరుగుతాయిని ప్రభుత్వం ప్రకటించిన సంగతి విధితమే. గత ఏడు సంవత్సరాలుగా నగర పాలక సంస్థకు ఎన్నికలు జరిగకపోవడంతో ఇంతకాలం నిస్తేజంగా ఉన్న రాజకీయ పార్టీలకు ప్రభుత్వ ప్రకటన ఉత్సాహం కలిగించింది. ఈ క్రమంలోనే ఇటీవల జరిగిన పేపర్ మిల్లు ఎన్నికల్లో కూటమి పార్టీల ఐక్యత ఎంత ఉందో స్పష్టమైంది. పేపర్ మిల్లు ఎన్నికలు, నాయకుల వ్యవహార శైలి అధిష్టానాలకు చేరిందని తెలుస్తుంది. భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభోత్సవ హడావిడిలో తలము నకలుగా ఉండడంతో అధిష్టానాలు పేపర్ మిల్లు ఎన్నికల ఫలితాల పై దృష్టి పెట్టలేదని తెలుస్తోంది. రెండు, మూడు రోజుల్లో వీటిపై దృష్టి పెట్టి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో

క్షేత్ర స్థాయిలో కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకుల మధ్య అనైక్యత వర్గ విభేదాలపై సమీక్ష జరుపుతారని తెలుస్తోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోను, 2029 లో జరిగే సాధారణ ఎన్నికల్లోనూ పేపర్ మిల్లు ఎన్నికల విధానాలు పునారామృతం కాకుండా

తగిన చర్యలు తీసుకుంటారని విశ్వాసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది

## వరదనష్టపరిహారం నిత్యవసరసరుకులు ఇవ్వాలి.

**-బి.జె.పి.జిల్లాకార్యదర్శి బొర్రా కామేశ్వరి,**

**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.2**

గోదావరివరదలుకారణంగావడ్డిగూడెంగ్రామానికి చుట్టువరదనీ రుచేరడంతో,ప్రజలునానాఇబ్బందులు పడ్డారు.మండల సంబంధిత,అధికారులు ప్రజలకు పడవలనుఏర్పాటు చేశారు.వరదలువచ్చి,నాలుగు రోజులుకావడంతో ప్రజలకుపనులులేకనానాఇబ్బం దులుపడుతుంటే, మండలసంబంధితఅధికారులు, తమపైఅదికారులకుసమ స్యలను,తెలియజేసి,ప్రజ లకుకావలిసిన,వరదబియ్యం, నిత్యవసర,సరుకులు, నేటికీఏర్పాటుచేయకపోవడం తోసంబంధితఅధికారు లు,ఏమిచేస్తున్నారుఅంటూ బి.జె.పి.జిల్లాకార్యదర్శి, బొర్రాకామేశ్వరి,ఆరోపించారు.

మండలంలోనికన్నయ్య గూడెం,చింతరేగుపల్లి,ప్రత్తిపాక, అడవివెంకన్నగూడెం, రామవరం,తదితరగ్రామాలుద్వారా నిత్యంప్రజలుతిరి గేరహదారులపైకివరదనీరుచేరడంతో,




మండలానికి,రా కపోకలునిలిచిపోవడంతో,మండలప్రజలునానాఇబ్బం దులుపడ్డారు.ప్రభుత్వఉచితవైద్యశిబిరాలుఏర్పాటు




చేశారు.వరదనీరుతగ్గుముఖంపట్టడంతోమండలప్రజలు,ఊపిరిపీల్చు కున్నారు.వరదతగ్గినతర్వాతవరద భాధితు లకువరదనష్టపరిహారంఅందించాలని,కోరారు.

# ఫ్రెండ్షిప్ డే వేళ 93-94 బ్యాచ్ ప్రాణ స్నేహితుల ఆత్మీయ కలయిక

**గోకవరంలో పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్న టెన్త్ క్లాస్ మిత్రబృందం**

**గోకవరం పెన్ పవర్ ఆగస్టు 02:–** ఫ్రెండ్షిప్ డే సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండల కేంద్రంలో 1993–94 టెన్త్ క్లాస్ బ్యాచ్‌కు చెందిన ప్రాణ స్నేహితులు ఆత్మీయంగా కలుసుకున్నారు. ఎన్నో సంవత్సరాల తర్వాత ఒకే చోట చేరిన మిత్రులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందోత్సాహాలతో ఫ్రెండ్షిప్ డే వేడుకలను జరుపుకున్నారు.

స్థానికంగా కరాసు శివరామకృష్ణ షాపు వద్ద సమావేశమైన మిత్రులు ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని ఫ్రెండ్షిప్ డే శుభాకాంక్షలుతెలియజేసుకున్నారు. విద్యార్థి దశలో కలిసి గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకుంటూ అప్పటి అనుభవాలను పరస్పరం పంచుకున్నారు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ, "ప్రపంచం అంతా మనల్ని వదిలి వెళ్లిపోయినా మనతో కలిసి నడిచే వాడే నిజమైన స్నేహితుడు. జీవితంలో ఎంతో మంది వచ్చి వెళుతుంటారు. కానీ నిజమైన స్నేహితులు మాత్రం మన హృదయాల్లో చెరగని ముద్ర వేస్తారు. ప్రియ మిత్రుడి గురించి ఆలోచించినప్పుడే బాధలు మాయమై, దుఃఖాలు దూరమవుతాయి. స్నేహం అనేది కాలంతో మారని, దూరంతో తగ్గని అపురూపమైన బంధం" అని పేర్కొన్నారు. ఈ ఆత్మీయ కలయికలో కాజా రామ్ కుమార్, జి. మోహన్, బోటు శీను, పల్లెల బాబి, మామిడి వీరభద్రరావు, కరాసు



శివరామకృష్ణతో పాటు 93–94 బ్యాచ్‌కు చెందిన పలువురు ప్రాణ స్నేహితులు పాల్గొని వేడుకలను మరింత ఆనందంగా మార్చారు. ఫ్రెండ్షిప్ డే సందర్భంగా జరిగిన ఈ సమావేశం పాత స్నేహ బంధాలను మరింత బలోపేతం చేస్తూ, జీవితాంతం నిలిచిపోయే మధుర జ్ఞాపకంగా మిగిలింది.

# ఏపీ ఐటీ ఇన్‌ఫ్రాకనెక్ట్ పోర్టల్ ద్వారా ఐటీ, జీసీసీ పెట్టుబడులకు కాకినాడ సిద్ధం

**: జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్**

**కాకినాడ, పెన్ పవర్, ఆగస్టు 2:** రాష్ట్రంలో ఐటీ , గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు పెట్టుబడులను ఆకర్షించి ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఏపీ ఐటీ ఇన్‌ఫ్రాకనెక్ట్ పోర్టల్ ద్వారా కాకినాడ జిల్లాలోని ప్రైవేట్ కార్యాలయ భవనాలు,వాణిజ్య సముదాయాలు, ఖాళీ స్థలాలు, భూముల వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు ఆయన వెల్లడించారు.

పెద్ద నగరాలతో పాటు టైర్–2 నగరమైన కాకినాడలో కూడా ఐటీ,జీసీసీ సంస్థలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. జిల్లాలో ఇప్పటికే అందుబాటులో ఉన్న కార్యాలయ భవనాలు,వాణిజ్య సముదాయాలు, ఖాళీ భూముల సమాచారాన్ని ఒకే డిజిటల్ వేదికపై ఉంచడం ద్వారా పెట్టుబడిదారులు తమ అవసరాలకు అనుగుణంగా అనువైన ప్రదేశాలను సులభంగా గుర్తించగలరని తెలిపారు. ఏపీ ఐటీ ఇన్‌ఫ్రాకనెక్ట్ పోర్టల్ ముఖ్య ఉద్దేశం జిల్లాలోని ప్రైవేట్ కార్యాలయ భవనాలు,వాణిజ్య సముదాయాలు, ఖాళీ భూములు,అభివృద్ధికి అనువైన స్థలాల సమాచారాన్ని ఒకే వేదికపై అందుబాటులో ఉంచడం. దేశీయ, అంతర్జాతీయ ఐటీ, జీసీసీ సంస్థలకు అవసరమైన మౌలిక సదుపాయాలను వేగంగా గుర్తించే అవకాశం కల్పించడం, పెట్టుబడిదారులు––ఆస్తి యజమానుల మధ్య పారదర్శక అనుసంధానం ఏర్పరచడం ద్వారా జిల్లాకు కొత్త పెట్టుబడులను ఆకర్షించి ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యమన్నారు.

పోర్టల్‌లో ప్రైవేట్ కార్యాలయ భవనాలు,వాణిజ్య సముదాయాలు, ఖాళీ స్థలాలు, భూముల వివరాలను ఉచితంగా నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. జియో–ట్యాగ్ ఆధారిత మ్యాప్ వ్యవస్థ ద్వారా ఆస్తుల స్థానాలను వీక్షించవచ్చని, పెట్టు బడిదారులు తమ అవసరాలకు అనుగుణంగా ఆన్‌లైన్‌లో భవనాలు, స్థలాలను ఎంపిక చేసుకోవచ్చని చెప్పారు. ప్లగ్–అండ్–ప్లే సౌకర్యాలు, ఐటీ పార్కులు, కాన్సెప్ట్ సిటీస్ వంటి అభివృద్ధి కార్యక్రమాలకు కూడా ఈ పోర్టల్ దోహదపడుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రైవేట్ కార్యాలయ భవనాలు,వాణిజ్య సముదాయాలు,ఖాళీ భూముల యజమానులు ఏపీ ఐటీలో తమ ఆస్తుల వివరాలను నమోదు చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. నమోదులు పూర్తిగా ఉచితమని తెలిపారు. పోర్టల్‌లో నమోదైన సమాచారాన్ని దేశీయ,అంతర్జాతీయ ఐటీ, జీసీసీ సంస్థలు పరిశీలించే అవకాశం ఉండడంతో కాకినాడ జిల్లాకు కొత్త పెట్టుబడులు ఆకర్షితమై స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని,జిల్లాను ఐటీ రంగంలో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా ఐటీ మేనేజర్ నరేంద్ర బాబు ఎం (మొబైల్: 9553959003)ను సంప్రదించాలని సూచించారు.

# మై భారత్ ఆధ్వర్యంలో ఘనంగా 'నషా ముక్త్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్'






**కాకినాడ, పెన్ పవర్, ఆగస్టు 2:** మై భారత్,కాకినాడ ఆధ్వర్యంలో 'నషా ముక్త్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమం ఆదివారం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మై భారత్ వాలంటీర్లు,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో దేశవ్యాప్తంగా యువతను ఉద్దేశించి ప్రసంగించారు. మాదక ద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, ప్రతి యువకుడు "నషా ముక్త్ భారత్ –– వికసిత్ భారత్" నిర్మాణంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ,మాదక ద్రవ్యాల నిర్మూలనలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యవంతమైన,బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి ప్రతి యువకుడు తన వంతు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు తమ కుటుంబాలు,స్నేహితులు,సమాజంలో మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించే దూతలుగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్ జి.ఎన్. సతీష్ రెడ్డి మాట్లాడుతూ, యువత తమ శక్తి,ప్రతిభను దేశాభివృద్ధికి వినియోగిస్తూ మాదక ద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మాదక ద్రవ్యాల దుష్పరిణామాలను ప్రతిబింబించే నుక్కడ్ నాటక్ ప్రదర్శించి ప్రేక్షకులను ఆలోచింపజేశారు. అనంతరం ప్రధానమంత్రి సందేశాన్ని వీక్షించిన విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ సమాజంలో అవగాహన కల్పించేందుకు సంకల్పం చేశారు. ఈ కార్యక్రమంలో మై భారత్ జిల్లా యువజన అధికారి గోపి,కాకినాడ జిల్లా డీజెబుల్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్,కాకినాడ ఈగల్ టీమ్ సీఐ జి. వెంకటేశ్వరరావు,ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో–ఛాన్సలర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, డీన్ (స్టూడెంట్ యాక్టివిటీస్) డి. కిషోర్,ఈగల్ టీమ్,మై భారత్ సిబ్బంది ఎం.ప్రకాష్,జి.భవాని తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 3న యథావిధిగా పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు

**కాకినాడ, పెన్ పవర్, ఆగస్టు 2:** ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు ఆగస్టు 3న యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ తెలిపారు. జిల్లా స్థాయిలో పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో, భూ సంబంధిత అంశాలపై రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం వివేకానంద హాలులో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ఇప్పటికే దాఖలు చేసిన అర్జీలు పరిష్కారం కాకపోయినా లేదా వాటి స్థితిగతులను తెలుసుకోవాలనుకున్నా అర్జీదారులు 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. అలాగే మీకోసం పోర్టల్ ద్వారా కూడా ప్రజలు తమ అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా ప్రజలు తమ స్పందనను నమోదు చేయాలని కలెక్టర్ కోరారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో కూడా పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను సమీపంలోని డివిజన్, మండల లేదా మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన కాకినాడ జిల్లా పోలీసులు

**కాకినాడ, పెన్ పవర్, ఆగస్టు 2:** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ లక్ష్యంగా కాకినాడ జిల్లా పోలీసులు ఆదివారం లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ పర్యవేక్షణలో, కాకినాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వన్‌టౌన్ సీఐ ఎం. నాగదుర్గారావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. పేకాట,క్రికెట్ బెట్టింగ్, వ్యభిచారం,ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడం, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడం లక్ష్యంగా నిర్వహించిన ఈ తనిఖీల్లో లాడ్జీల్లో బస చేస్తున్న వారి వివరాలు,అతిథుల రిజిస్టర్లు, గుర్తింపు పత్రాలను పరిశీలించి నిబంధనల అమలును తనిఖీ చేశారు. లాడ్జి యజమానులు,నిర్వాహకులు ప్రతి అతిథి నుంచి ఆధార్ కార్డు లేదా ఇతర ప్రభుత్వ గుర్తింపు పొందిన ఫోటో గుర్తింపు పత్రాన్ని తప్పనిసరిగా తీసుకున్న తర్వాతే గదులు కేటాయించాలని పోలీసులు ఆదేశించారు. అలాగే సందర్శకుల పూర్తి వివరాలను రిజిస్టర్లలో నమోదు చేసి, వాటి ప్రతులను ఎప్పటికప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్‌కు పంపించాలని సూచించారు. లాడ్జీల్లో కొత్త లేదా అనుమానాస్పద వ్యక్తులు బస చేస్తున్నట్లు గుర్తించినా,చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా 112 అత్యవసర సేవలకు సమాచారం అందించాలని పోలీసులు ప్రజలను కోరారు.



# బోనాలెత్తిన గెద్దపేట మహిళలు





**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 2:** జగ్గంపేటలోని గెద్దపేట పూలతోటలో వెలసిన శ్రీ చింతాలమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లకు ఆదివారం స్థానిక మహిళలు బోనాలు సమర్పించారు. ముందు రోజు అమ్మవార్లకు భక్తులు ఆషాడం సారెను ఊరేగించి ఆలయానికి అందజేశారు. ఆదివారం చింతాలమ్మ ఆలయం నుంచి బోనాలు ఎత్తుకొని జగ్గంపేట గ్రామదేవత రావులమ్మ తల్లి గుడి వరకు వెళ్లి అక్కడ అమ్మవారిని దర్శించుకుని అక్కడి నుంచి తిరిగి అమ్మవార్ల ఆలయాలను దర్శించుకుంటూ చివరకు చింతాలమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా చింతాలమ్మ ఆలయం వద్ద భారీ అన్నసంతర్పణ నిర్వహించారు.

# స్నేహితుల దినోత్సవం రోజున మొక్కలు నాటి వినూత్నంగా వేడుకలు జరుపుకున్న మిత్రులు



**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు, 02:** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ప్రాంగణంలో మొదటి ఆదివారం స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని ప్రాణస్నేహితులు అయిన ఆదిత్య విద్యాసంస్థల ఎస్టేట్ మేనేజర్ మేడపాటి భాస్కర చంద్రారెడ్డి,జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత ఆదిత్య యూనివర్సిటీ ప్రెస్ రిలేషన్ ఆఫీసర్ తోటకూర గంగాధర్ ఇద్దరు మొక్కలు నాటి ఆదర్శంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భాస్కర చంద్రారెడ్డి మాట్లాడుతూ అందరికీ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ స్నేహం అనేది ఒక అనిర్వచనీయమైన భావన అని ఒకే తల్లికి పుట్టకపోయినా.. పేగుబంధం కన్న మిన్నగా పెనవేసుకున్న బంధం స్నేహబంధం అని రక్తం పంచుకుని పుట్టకపోయినా.. కన్న తల్లిదండ్రుల వద్ద కూడా చెప్పలేని భావాలు, బాధలను స్నేహితుల వద్ద మాత్రమే వ్యక్తీకరిస్తామని అన్నారు. కుల,మత వర్గ భేదాలకు తావీయకుండా అందరూ స్నేహభావంతో మెలిగిన నాడు సమాజంలో ఎటువంటి స్పర్థలకు తావుండదు అని అన్నారు. గంగాధర్ మాట్లాడుతూ భాస్కర చంద్రారెడ్డి లాంటి మిత్రుడు లభించడం తన జీవితంలో అదృష్టంగా భావిస్తాను అని అన్నారు. పుట్టిన రోజు పెళ్లి రోజు సందర్భం ఏదైనా మొక్కలు నాటడం మొక్కలు పెంచడం అలవాటు చేసుకుని పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ మేనేజర్ పి. బి.ఎస్,జె. చక్రవర్తి, అగ్రికల్చర్ సూపర్వైజర్. పి. బ్రహ్మానందరావు తదితరులు పాల్గొన్నారు.

# పూర్వపు విద్యార్థుల కలయికతో సందడిగా మారిన జిల్లా పరిషత్ పాఠశాల




**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 02:** గండేపల్లి మండలం మురారి జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థుల కలయికతో ఆదివారం సందడిగా నెలకొంది. స్నేహితుల రోజు పురస్కరించుకొని ఒక పండగల ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2004, 2005 సంవత్సరంలో చదివిన మేము స్నేహితుల రోజున పురస్కరించుకుని కలవడం చాలా ఆనందంగా ఉందని చదివిన ఆ రోజులు గుర్తొస్తున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. అందరూ ఉద్యోగాలు, వివిధ రకాల వ్యాపారాలు లో స్థిరపడి ఆనందంగా జీవితం వెలపచ్చుతున్నట్లు తెలిపారు. విద్య తోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని విలువైన స్నేహాన్ని అందిపుచ్చుకోవచ్చునని ఈ సందర్భంగా తెలియజేశారు. అన్ని బంధాల కన్నా స్నేహబంధం గొప్పదని స్నేహబంధం గొప్పతనాన్ని తెలియజేశారు. ఉదయం నుండి సాయంకాలం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. దాంతో ఆ ప్రాంగణమంతా స్నేహితుల బంధంతో కళకళలాడింది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# పదవుల ఎఫెక్ట్: ఆశావహులు.. అదుపు తప్పుతున్నారా?

**హైదరాబాద్ పెన్ పవర్:** టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ధిక్కార స్వరం వినిపిస్తున్నారా? స్థానికంగా తన హవాను పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారా? అంటే.. అవుననే సమాధానమే టీడీపీ వర్గాల్లో వినిపిస్తోంది. కాకినాడ పోర్టును విస్తరించే పనులకు ఆయన సుముఖంగానే ఉన్నా.. పార్టీ పరంగా ఆయన వ్యవహరించడం లేదనే టాక్ వినిపిస్తోంది. కాకినాడ పోర్టకు కోన పోర్టుగా పేరు పెట్టాలన్నది యనమల డిమాండ్. అయితే.. ఇది సాధ్యమేనా? అనేది ప్రశ్న.
పైగా ఎవరికీ లేని ఈ డిమాండ్ విషయంలో యనమల స్థానికతను పురిగొల్పుతున్నారు. పోర్టుకు అవసరమైన భూములు ఇస్తోంది కోనసీమ ప్రాంత రైతులని, కాబట్టి.. పోర్టుకు కోన పేరు పెట్టాలన్నది యనమల సూచన. ఇదే ఇప్పుడు డిమాండ్‌గా మారుతోంది. ఈ నెల 20లోగా ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని కోన పోర్టుగా పేరు నిర్ధారించాలని.. లేకపోతే, ప్రజల ఆకాంక్షల మేరకు తాను కూడా వ్యవహరిస్తానని చెప్పు కొచ్చారు. ఈ వ్యవహారంపై ఆయన ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు.
ఇక్కడితో కూడా ఆగకుండా.. తాజాగా స్థానికులతో భేటీ కావడం మరింత ఆసక్తిగా మారింది. కోన సీమ రైతు ల నుంచి భూములు తీసుకుంటున్నారని, అలాంటప్పుడు కాకినాడ పోర్టు అని పేరు ఎందుకని ఆయన చెబుతున్నారు. అయితే.. వాస్తవానికి.. భూములు తీసుకున్నంత మాత్రాన అదే పేరును ఉంచాలని ఏమీ లేదు. ఈ విషయం తెలిసినప్పటికీ.. యనమల మాత్రం తన దారి తనదే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. స్థానికంగా ఇది పెద్ద ఉద్యమంగా మారాలని ఆయన ఆకాంక్షిస్తున్నట్టు తెలుస్తోంది.

**ప్రాధాన్యం కొరవడడంతోనే..**

ఇటు పార్టీలోను, అటు ప్రభుత్వంలోనూ యనమల ప్రాధాన్యం ఒకప్పుడు ఉన్నట్టుగా ఇప్పుడు లేదు. గతంలో తిప్పిన చక్రం.. ఇప్పుడు మూలబడినట్టుగా ఆయన పరిస్థితి మారిపోయింది. ఎమ్మెల్సీగా రిటైరైన తర్వాత.. రాజ్యసభ ఆశించారు. లేదా గవర్నర్ గిరీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ రెండు చేజారుతున్నా యి. పైగా తన ముందు రాజకీయాల్లోకి వచ్చిన వారికి పదవులు దక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ తనను పూర్తిగా పక్కన పెడుతోందని గ్రహిస్తున్న ఆయన.. ఇలా.. కీలక



విషయాలపై ఫోకస్ చేశారని రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న మాట.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మొక్కే కదా అని వదిలేయలేదు.. భోగాపురంలో వైరల్ వీడియో

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం అత్యంత వైభవంగా ముగిసింది. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ గ్రీన్ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌ను శనివారం ఘనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ చారిత్రాత్మక వేడుకకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఒకే వేదికపైకి వస్తున్నారన్న వార్తతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. అంచనాలను మించి సుమారు మూడు లక్షల మందికి పైగా జనం ఈ సభకు హాజరు కావడంతో ప్రాంగణమంతా కిటకిటలాడింది. అంగరంగ వైభవంగా సాగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రస్తుతం సోషల్ మీడియాలోనూ హాట్ టాపిక్‌గా మారింది.అయితే, ఈ కార్యక్రమం విజయవంతం కావడమే కాకుండా, సభ ముగిసిన తర్వాత చోటుచేసుకున్న ఓ ఘటన ఇప్పుడు నెట్టింట తీవ్ర చర్చనీయాంశమైంది. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ వేడుకల కంటే కూడా, అక్కడ జరిగిన ఒక సరదా సంఘటనకు సంబంధించిన వీడియోలు విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. సభ ముగిసి నాయకులు, ప్రముఖులు వెనుదిరిగిన వెంటనే, సభా ప్రాంగణంలోనూ, ఎయిర్‌పోర్ట్ ప్రవేశ మార్గంలోనూ సుందరీకరణ కోసం ప్రత్యేకంగా అమర్చిన అలంకరణ మొక్కలను కొందరు సభికులు పీక్కుని మరీ ఇళ్లకు తరలించుకుపోయారు. లక్షలాదిగా వచ్చిన జనప్రవాహంలో కొందరు ఉత్సాహంతోనో, లేదా ఈ చారిత్రాత్మక జ్ఞాపకంగా తమతో పాటు తీసుకెళ్లాలన్న సరదాతోనో అక్కడి మొక్కలను కుండీలతో సహా ఎత్తుకెళ్లడం అందరినీ ఆశ్చర్యపరిచింది.
ఇందుకు సంబంధించిన దృశ్యాలు, ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. విమానాశ్రయం ప్రారంభోత్సవ విశేషాలు, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ప్రసంగాల కంటే ఈ మొక్కల ఎపిసోడ్‌పైనే నెటిజన్లు ఎక్కువగా చర్చించుకుంటున్నారు. కొందరు దీనిని సరదాగా కొట్టిపారేస్తుంటే, మరికొందరు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై సోషల్ మీడియా వేదికగా భిన్నమైన కామెంట్లు పెడుతున్నారు. ఏది ఏమైనప్పటికీ, దశాబ్దాల కల అయిన భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం అభివృద్ధి పరంగా ఎంత ప్రాధాన్యత సంతరించుకుందో, ఈ మొక్కల ఎపిసోడ్‌తో సోషల్ మీడియాలో అంతకుమించి వైరల్ అయ్యి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.కొత్త విమానాశ్రయం ప్రారంభంతో ఈ ప్రాంతం అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందుతుందని అందరూ సంతోషం వ్యక్తులతో మురిసిపోతున్న వేళ, ఈ తరహా చిన్నచిన్న దృశ్యాలు సోషల్ మీడియాలో కేవలం సరదా చర్చలకే పరిమితమయ్యాయి. అభివృద్ధి సంబరాల నడుమ ఇలాంటి యాదృచ్ఛిక ఘటనలు పండుగ వాతావరణంలో చిన్న సరదా జ్ఞాపకాలుగా నిలుస్తుంటాయని, వీటిని కేవలం సరదా కోణంలోనే చూడాలని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి, ఉత్తరాంధ్ర భవిష్యత్తును మార్చే అభివృద్ధి పర్వంతో పాటు, ఈ సరదా ఘటన కూడా ఈ ప్రారంభోత్సవ వేడుకలో ఒక విశేషంగా నిలిచింది.

# ఉత్తరాంధ్రా ఫోకస్... కూటమికి ప్లస్ అవుతుందా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తరాంధ్రా జిల్లాలలో 34 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమి స్వీప్ చేసి పారేసింది. అరకు పాడేరు తప్ప అన్ని సీట్లు టీడీపీ కూటమి పరం అయ్యాయి. 2029 ఎన్నికల్లో ఇదే ఊపు కొనసాగించాలని కూటమి చూస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు ఉత్తరాంధ్రా మీద ప్రత్యేక ఫోకస్ పెట్టారు. అన్ని రకాలైన అభివృద్ధి కార్యక్రమాలు అక్కడే చేపడుతున్నారు. ఇప్పటికే ప్రపంచంలోనే టాప్ రేంజిలో ఉన్న గూగుల్ డేటా సెంటర్ ని విశాఖలో ఏర్పాటు చేయించిన చంద్రబాబు కొద్ది నెలల క్రితం దాని శంకుస్థాపనను ఘనంగా నిర్వహించారు. 2028 నాటికి గూగుల్ తన ఆపరేషన్స్ ని స్టార్ట్ చేయనుంది. కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ కార్యక్రమంలో పాల్గొని కేంద్ర సాయానికి భరోసా ఇచ్చారు.

**మిట్టల్ స్టీల్ ప్లాంట్ తో :**

ఇక అనకాపల్లి జిల్లాలో ఏకంగా లక్షా నలభై వేల కోట్ల రూపాయలతో రెండు దశలలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ రానుంది. దానికి కూడా చంద్రబాబు కేంద్ర మంత్రి కుమారస్వామితో కలసి శంకుస్థాపన చేశారు. తొలిదశ ఆపరేషన్స్ 2028లో మొదలవుతాయని చెబుతున్నారు. ఆ విధంగా డెడ్ లైన్ విధించి మరీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని రకాలైన అనుమతులు మంజూరు చేశారు. ఇక ఇదే జిల్లాలో బల్క్ డ్రగ్ పార్క్ రానుంది. అలాగే ఇతర పరిశ్రమలు కూడా అనకాపల్లి జిల్లా చుట్టు పక్కల వస్తున్నాయి. విశాఖ జిల్లాలో చూస్తే అనేక ఐటీ కంపెనీలు తరలి వస్తున్నాయి. అదే విధంగా మరిన్ని డేటా సెంటర్లు కూడా విశాఖ విజయనగరం జిల్లాలలో ఏర్పాటుకు సిద్ధపడుతున్నాయి. ఇప్పటికే భోగాపురం వద్ద అదానీ డేటా సెంటర్ కి కూడా రంగం సిద్ధం అయింది.

**శ్రీకాకుళంలో సైతం :**

ఇంకో వైపు చూస్తే శ్రీకాకుళం జిల్లాలో మూలపేట పోర్టు కూడా 2028 నాటికి ఆపరేషన్స్ కి సిద్ధంగా ఉంది. అలాగే ఇక్కడే పలాస నియోజకవర్గంలో కార్గో ఎయిర్ పోర్టుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం దానికి సంబంధించి పూర్వ రంగం సిద్ధం అవుతోంది. భోగాపురం ఎయిర్ పోర్టు విజయనగరంలో అంగరంగ వైభవంగా ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభం అయింది. రానున్న రోజులలో అంటే వరసగా 2028 లలో అనేక పరిశ్రమలు ఉత్తరాంధ్రాలో ప్రారంభం కానున్నాయి అని అంటున్నారు.

**కూటమికి సానుకూలంగా :**

ఇదిలా ఉంటే ఉమ్మడి విశాఖ జిల్లా కూటమికి ఈ రోజుకీ కంచుకోటగా ఉంది. అక్కడ అభివృద్ధి జరుగుతున్న తీరు పట్ల జనాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లి పరిసరాలలో అయితే ఎన్నడూ చూడని విధంగా ప్రగతి ప్రాజెక్టులు పట్టాలెక్కుతున్నాయి. దాంతో విజయనగరం శ్రీకాకుళం జిల్లాలలో సైతం కూటమి ప్రభుత్వం పట్ల సానుకూలత ఈ ప్రాజెక్టుల వల్ల రానుంది అని ఆయా పార్టీల నాయకులు బలంగా నమ్ముతున్నారు. చంద్రబాబు సైతం ప్రతీ శంకుస్థాపనను ప్రతీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు ఉత్తరాంధ్రా అభివృద్ధి తమ ప్రాధాన్యత అని ఆయన గట్టిగా చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి కూటమి కనుక స్వీప్ చేస్తే ఏపీలో అధికారం దక్కుతుందన్నది కూటమి ఆలోచనగా ఉంది. ఆ దిశగా కూటమి ప్రభుత్వం వైపు నుంచి బాగానే కసరత్తు సాగుతోంది. భోగాపురం ఎయిర్ పోర్టు మొత్తం ఉత్తరాంధ్ర అభివృద్ధి దశనే కాదు రాజకీయ దశ దిశను మారుస్తుందా అన్నది కూడా చూడాల్సి ఉంది అని అంటున్నారు.

# చంద్రబాబు సీక్రెట్ అదే.. పిఠాపురం వర్మ విషయంలో బయటపెట్టిన సీఎం

**హైదరాబాద్ పెన్ పవర్:** రాజకీయాల్లో పదవులు వస్తుంటాయి పోతుంటాయి.. కానీ నాయకులకు, అధిష్టానానికి మధ్య ఉండే మానవతా సంబంధాలే పార్టీని చిరకాలం నిలబెడతాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఈ విషయంలో అధికార టీడీపీకి ప్రత్యేకమైన చరిత్ర ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీ నేతల పనితీరుతోపాటు వ్యక్తిగత క్రమశిక్షణను అనుక్షణం పర్యవేక్షించడం తెలుగుదేశం పార్టీకి మాత్రమే ప్రత్యేకం అంటున్నారు. ఈ విషయంలో కార్యకర్త నుంచి అధినేత వరకు ఎవరైనా ఒకటే అంటున్నారు. ఇదే సమయంలో నాయకులతో వ్యక్తిగత అనుబంధంపై కూడా పార్టీ పెద్దలు ఎక్కువ ఫోకస్ చేస్తుంటారని అంటున్నారు. దీంతో టీడీపీలో ప్రతి నేత కూడా పార్టీ తన సొంత ఆస్తిగా భావిస్తారని చెబుతున్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా తనకు ఎదురైన మాజీ ఎమ్మెల్యే వర్మను సీఎం చంద్రబాబు ఆత్మీయంగా పలకరించారని చెబుతున్నారు. అంతేకాకుండా ఇద్దరూ కలిసి నవ్వుతూ ఫొటోలకు ఫోజు ఇచ్చారు. పార్టీకి చెందిన నేతలతో అధినేత ఇలా ఫొటోలు దిగడం సాధారణమే అయినప్పటికి మాజీ ఎమ్మెల్యే వర్మ విషయంలో మాత్రం చాలా ప్రత్యేకంగానే చూడాలని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కోసం తన ఎమ్మెల్యే టికెట్ ను త్యాగం చేసిన మాజీ ఎమ్మెల్యే వర్మ రెండేళ్లుగా నామినేటెడ్ పదవి కోసం ఎదురుచూస్తున్నారు.2019 ఎన్నికల తర్వాత పిఠాపురంలో తెలుగుదేశం పార్టీని కాపాడుకోవడానికి వర్మ తీవ్రంగా కష్టపడ్డారు. చాలా వరకు డబ్బు కూడా ఖర్చుపెట్టారు. ఎన్నికల సమయంలో జనసేన అధినేత పవన్ ఆ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానంటే మాజీ ఎమ్మెల్యే వర్మ తన సీటును త్యాగం చేశారు. ఈ సమయంలో ఆయనకు నామినేటెడ్ పదవి ఇస్తామని అధిష్టానంతోపాటు జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కూడా హామీ ఇచ్చారు. ఇక ఎన్నికల్లో పవన్ గెలిచిన తర్వాత సీన్ మారిపోయింది. ఎన్నికలు ముగిసి రెండేళ్లు అవుతుండగా, పిఠాపురంలో జనసేన-టీడీపీ సంబంధాలు దెబ్బతిన్నాయని అంటున్నారు. ఇరుపార్టీల నేతలు ఎవరికి వారు మనుగడ కోసం సొంతంగా పనిచేయడంతో కూటమి ఐక్యతపై అనేక అనుమానాలు తలెత్తాయి.
అయితే, ఈ పరిస్థితిపై ఆందోళన చెందిన తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే వర్మను పార్టీ పదవి నుంచి తప్పించింది. సహజంగా ఇటువంటి పరిస్థితి ఎదురైతే ఏ నేత అయినా అవమానకరంగా భావిస్తారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కానీ, మాజీ ఎమ్మెల్యే వర్మ మాత్రం తనను పక్కన పెట్టిన అధిష్టానం చర్యతో బాధపడినప్పటికీ అది తమ పార్టీ అంతర్గత విషయంగా సర్దుకుపోయారు. దీంతోనే అధిష్టానం కూడా ఆయన విషయంలో తీవ్ర తర్జనభర్జనకు గురవుతోందని అంటున్నారు. ఇందుకే మాజీ ఎమ్మెల్యే వర్మ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా సానుకూలంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభం సందర్భంగా చాలా మంది నేతలు వచ్చినప్పటికీ మాజీ ఎమ్మెల్యే వర్మను మాత్రం ప్రత్యేకంగా పలకరించి తన ఆత్మీయతను సీఎం ప్రదర్శించారని చెబుతున్నారు. ఈ చర్య వర్మ ఒక్కరికే కాకుండా తెలుగుదేశం పార్టీలో మానవ విలువలకు ఇచ్చే గౌరవంగా చెబుతున్నారు. కూటమి పటిష్టంగా ఉన్న ఈ దిశలో ఉప ముఖ్యమంత్రితో రాజకీయ బంధం కోరుకుంటూనే వర్మను దూరం చేసుకోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రదర్శిస్తున్న రాజకీయ, వ్యక్తిగత అనుబంధాలు హాట్ టాపిక్ అవుతున్నాయని అంటున్నారు.

# కరెంటు స్తంభాలు ఉండవు.. తీగలు అసలే కనిపించవు!

# దేశంలోనే తొలి 'పోల్-ఫ్రీ' నగరంగా అమరావతి

**హైదరాబాద్ పెన్ పవర్:** రాజధాని అమరావతి పనులు చకచకగా సాగుతున్నాయి. 2028 నాటికి రాజధాని తొలిదశ పనులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా ప్రకటించారు. ప్రస్తుతం రాజధానికి రాజమార్గమైన సీడ్ యాక్సెస్ రోడ్డుతోపాటు అంతర్గత రహదారుల నిర్మాణాలు శరవేగంగా చేస్తున్నారు. ఇదే సమయంలో ఐకానిక్ టవర్స్ నిర్మాణాలు, ఇతర ప్రభుత్వ భవనాల పనులు పరుగులు తీయిస్తున్నాయి. అయితే వీటికి సమాంతరంగా అమరావతికి అంతర్జాతీయ స్థాయి నగరంలో తీర్చిదిద్దేలా ప్రభుత్వం పోల్ ఫ్రీ కేపిటల్ గా మార్చుతోంది. దేశంలో ఏ ఇతర నగరాల్లో లేనట్లు భూగర్భ కేబుల్ వ్యవస్థ ద్వారా అమరావతికి ఒక అధునాతన నగరంగా ప్రభుత్వం నిర్మిస్తోంది. మన దేశంలోని ఏ నగరంలో చూసినా కళ్లకు కనిపించే ఒకే ఒక సాధారణ దృశ్యం రోడ్ల వెంబడి వేలాడే విద్యుత్ తీగలు, ఇంటర్నెట్ కేబుల్స్, ప్రమాదకరమైన కరెంట్ పోల్స్. అయితే రాజధాని అమరావతిలో ఇలాంటి దృశ్యాలు కనిపించకుండా ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతోందని చెబుతున్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా 'పోల్-ఫ్రీ'), ఓవర్ హెడ్ కేబుల్స్-రహిత నగరంగా అమరావతి రూపుదిద్దుకుంటోందని ప్రభుత్వ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఇది భవిష్యత్ తరాల కోసం తలపెట్టిన ఒక అద్భుతమైన అర్బన్ ఇంజనీరింగ్ విప్లవంగా చెబుతున్నారు. దేశంలోని నగరాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో విద్యుత్ అంతరాయాలు, వర్షాకాలంలో మునిగిపోయే రహదారులు, ప్రతిసారీ కేబుల్స్, పైప్‌లైన్ల కోసం రోడ్లను తవ్వడం వంటివి ప్రధానమైనవి. ఈ సమస్యలన్నింటికీ అమరావతి మాస్టర్ ప్లాన్ అత్యంత శాశ్వతమైన, శాస్త్రీయమైన పరిష్కారాన్ని చూపుతోందని అంటున్నారు. అంతర్జాతీయ స్థాయిలో సింగపూర్, టోక్యో, దుబాయ్ వంటి నగరాలు అనుసరిస్తున్న అత్యాధునిక మౌలిక వసతుల విధానాన్ని అమరావతిలో అమలు చేస్తున్నారు. ముఖ్యంగా నగర సౌందర్యానికి ఎటువంటి భంగం కలగకుండా, పర్యావరణ హితంగా, అత్యంత సురక్షితమైన వాతావరణంలో ఈ రాజధాని నిర్మాణం సాగుతోంది.



**పోల్-ఫ్రీ, అండర్‌గ్రౌండ్ యుటిలిటీస్ ప్రత్యేకతలు**

సాధారణ నగరాల్లో విద్యుత్ సరఫరా, టెలిఫోన్, ఇంటర్నెట్ కేబుల్స్ అన్నీ రోడ్ల వెంట పెద్ద పెద్ద పోల్స్ మీద వేలాడుతూ ఉంటాయి. దీనివల్ల నగర సౌందర్యమే కాకుండా, ఈదురు గాలులు, తుఫానులు వచ్చినప్పుడు విద్యుత్ వ్యవస్థ క్షణాల్లో అస్తవ్యస్తమవుతుంది. కానీ అమరావతిలో ఈ సమస్య తలెత్తకుండా ముందుజాగ్రత్తలు తీసుకుంటున్నారు. అత్యుత్తమ అండర్‌గ్రౌండ్ టెక్నాలజీని వాడుతున్నారు.
తుఫానులు, ఈదురుగాలులు, భారీ వర్షాల వల్ల విద్యుత్ అంతరాయం కలగకుండా హై-టెన్షన్ పవర్ లైన్స్ సహా అన్ని విద్యుత్ కేబుల్స్‌ను భూగర్భంలో అత్యంత పటిష్టంగా అమర్చుతున్నారు. రోడ్ల పక్కన డ్రైనేజీ కాలువలకు ఆనుకుని సుమారు 700 కి.మీ. మేర భూగర్భ డక్ట్‌లను నిర్మిస్తున్నారు. ఇందులో విద్యుత్, టెలిఫోన్, ఇంటర్నెట్, గ్యాస్ పైప్‌లైన్లు అన్నీ ఒకే వ్యవస్థలో భూమిలో ఉంటాయి. ఏదైనా కొత్త కేబుల్ వేయాలన్నా లేదా రిపేర్ చేయాలన్నా మళ్లీ రోడ్లు తవ్వాల్సిన అవసరం లేకుండా ప్రత్యేకమైన వాకింగ్ టన్నెల్స్, డక్ట్‌ల ద్వారా ఇంజనీర్లు నేరుగా లోపలికి వెళ్లి పనులు చేసుకునేలా రూపకల్పన చేశారు.

**బ్లూ-గ్రీన్ కాన్సెప్ట్, డిజాస్టర్-ప్రూఫ్ టెక్నాలజీ**

అమరావతి మాస్టర్ ప్లాన్ పూర్తిగా బ్లూ-గ్రీన్ కాన్సెప్ట్ ఆధారంగా రూపొందించారు. కృష్ణా నది తీరాన రూపుదిద్దుకుంటున్న ఈ రాజధానిలో పర్యావరణ పరిరక్షణకు, నీటి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. నగరంలో ప్రతి చుక్క నీటిని సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు ఉన్నాయి. నగరంలో వర్షపు నీరు ఎక్కడా నిలవకుండా అత్యాధునిక స్టార్మ్‌వాటర్ డ్రైన్స్, తాగునీటి సరఫరా కోసం 24/7 పైప్‌లైన్లు, రీ-యూజ్డ్ వాటర్ లైన్లు, అత్యాధునిక సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటవుతున్నాయి. దీనివల్ల అమరావతి కేవలం అందమైన నగరంగానే కాకుండా, ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా తట్టుకునే 'డిజాస్టర్-ప్రూఫ్' రాజధానిగా నిలుస్తోంది. ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల భాగస్వామ్యంతో రూ. 11,467 కోట్ల భారీ నిధులతో ఈ మౌలిక వసతుల నిర్మాణం వేగంగా సాగుతోంది. ఏపీసీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విద్యుత్ పోల్స్ లేని, తీగల చిక్కులు లేని, పచ్చని చెట్లతో, అండర్‌గ్రౌండ్ టెక్నాలజీతో రూపుదిద్దుకుంటున్న అమరావతి దేశ భవిష్యత్ పట్టణాభివృద్ధికి ఒక సరికొత్త దిశానిర్దేశంగా వ్యాఖ్యానిస్తున్నారు. దశాబ్దాల తరబడి మన దేశం ఎదుర్కొంటున్న నగర నిర్మాణ సవాళ్లకు సమాధానం చెబుతూ, గ్లోబల్ సిటీగా అమరావతి రూపాంతరం చెందుతుందని ప్రభుత్వ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

# టీమిండియాకు ఎదురుదెబ్బ.. శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు బుమ్రా కష్టమే!

- మోకాలి గాయంతో శ్రీలంక టెస్టు సిరీస్‌కు బుమ్రా దూరం
- ఇంగ్లండ్ పర్యటనలో అయిన గాయం నుంచి ఇంకా కోలుకోని బుమ్రా!
- వైద్యుల సూచనతో విశ్రాంతికి మొగ్గుచూపిన బీసీసీఐ
- బుమ్రా స్థానంలో అకిబ్ నబీని తీసుకునే అవకాశం
- ఆగస్టు 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్టు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జట్టు ప్రధాన పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా, శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు దూరమయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎడమ మోకాలిలో అసౌకర్యంతో బాధపడుతున్న అతనికి పూర్తిస్థాయిలో కోలుకోవడానికి మరింత సమయం అవసరమని బీసీసీఐ వైద్య బృందం భావిస్తోంది. దీంతో ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న ఈ కీలక సిరీస్‌కు బుమ్రా సేవలు కోల్పోవడం దాదాపు ఖాయమైంది.

వివరాల్లోకి వెళ్తే, గత నెల ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో బుమ్రా గాయపడ్డాడు. జులై 19న కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో ఫీల్డింగ్ చేస్తుండగా అతని ఎడమ మోకాలికి దెబ్బ తగలడంతో వాపు వచ్చింది. అప్పటి నుంచి అతను బౌలింగ్‌కు దూరంగా ఉన్నాడు. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు)లో ఉన్న బుమ్రా, ఇంకా బౌలింగ్ ప్రాక్టీస్ ప్రారంభించలేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. "ఇప్పుడే అతడిని ఆడిస్తే గాయం తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉంది. అందుకే, బుమ్రా పూర్తిగా కోలుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నాం. ఈ నేపథ్యంలో శ్రీలంక పర్యటనకు అతను దూరంగా ఉండొచ్చు" అని ఓ అధికారి ఐఏఎన్ఎస్‌కు తెలిపారు. వాస్తవానికి, శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టెస్టు జట్టుకు బుమ్రాను ఎంపిక చేసినప్పటికీ, ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే తుది జట్టులో ఉంటాడని సెలక్టర్లు స్పష్టం చేశారు. ఇప్పుడు అతను దూరం కానుండటంతో, అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ అతని స్థానంలో ప్రత్యామ్నాయ ఆటగాడిని ప్రకటించనుంది. జమ్మూ కశ్మీర్ సీమ్ బౌలింగ్ ఆల్ రౌండర్ అకిబ్ నబీ ఈ రేసులో ముందున్నాడు. ఇటీవల రంజీ ట్రోఫీలో 60 వికెట్లతో సత్తాచాటిన నబీ, ఇండియా-ఏ తరఫున శ్రీలంక పర్యటనలోనూ రాణించాడు.

బుమ్రా గైర్హాజరీతో భారత పేస్ బౌలింగ్ విభాగంలో మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్ మాత్రమే మిగిలారు. భారత జట్టు ఆగస్టు 4న శ్రీలంకకు బయలుదేరి వెళ్లనుంది. అక్కడ ఆగస్టు 7 నుంచి 9 వరకు కొలంబోలో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడుతుంది. అనంతరం గాలే వేదికగా ఆగస్టు 15న తొలి టెస్టు, కొలంబోలో ఆగస్టు 23 నుంచి రెండో టెస్టు జరుగుతాయి.

# కెప్టెన్‌గా తిలక్ వర్మ.. దులీప్ ట్రోఫీకి సౌత్ జోన్ జట్టు ఇదే!

- దులీప్ ట్రోఫీకి సౌత్ జోన్ కెప్టెన్‌గా తిలక్ వర్మ ఎంపిక
- ఆంధ్ర ఆటగాడు రికీ భుయ్‌కు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు
- గత రంజీ సీజన్ టాప్ స్కోరర్ స్మరణ్, కరుణ్ నాయర్‌కు జట్టులో చోటు
- గతేడాది ఫైనలిస్ట్ కావడంతో నేరుగా సెమీఫైనల్‌కు అర్హత
- ఈ నెల 23 నుంచి బెంగళూరు వేదికగా ఈ టోర్నమెంట్ ప్రారంభం



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ దులీప్ ట్రోఫీ కోసం సౌత్ జోన్ తమ జట్టును ప్రకటించింది. భారత టీ20 జట్టు వైస్ కెప్టెన్, హైదరాబాద్ యువ సంచలనం తిలక్ వర్మకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. ఆంధ్ర జట్టుకు చెందిన సీనియర్ బ్యాటర్ రికీ భుయ్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఆగస్టు 23 నుంచి సెప్టెంబర్ 10 వరకు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు) వేదికగా ఈ టోర్నమెంట్ జరగనుంది. నేడు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి సానా సతీశ్ బాబు నేతృత్వంలో సెలక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఆంధ్ర మాజీ రంజీ ఆటగాడు ఆర్వీ చంద్రమౌళి ప్రసాద్ ఈ సెలక్షన్ ప్యానెల్‌కు ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సమావేశంలో సౌత్ జోన్‌లోని ఏడు సభ్య సంఘాలైన ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక, హైదరాబాద్, గోవా, పాండిచ్చేరి, కేరళ ప్రతినిధులు పాల్గొన్నారు. జట్టుకు హెడ్ కోచ్‌గా ఆంధ్రకు చెందిన అనుభవజ్ఞుడైన లెవల్ 2 కోచ్ ఎంఎన్ విక్రమ్ వర్మను నియమించారు.

15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో యువత, అనుభవం చక్కగా మేళవించారు. భారత జట్టుకు ఆడిన వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్‌కు చోటు దక్కింది. 2025/26 రంజీ ట్రోఫీ సీజన్‌లో 950 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన కర్ణాటక యువ ఆటగాడు ఆర్. స్మరణ్, హైదరాబాద్‌కు చెందిన కె. హిమతేజ వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లను ఎంపిక చేశారు. ఇటీవలే జింబాబ్వేపై 3-0తో టీ20 సిరీస్ గెలిచిన భారత జట్టులో తిలక్ వర్మ సభ్యుడిగా ఉన్నాడు. శ్రీలంక 'ఏ'తో సిరీస్ గెలిచిన భారత 'ఏ' జట్టులో సభ్యులుగా ఉన్న షేక్ రషీద్ (ఆంధ్ర), ఎన్. జగదీశన్ (తమిళనాడు) కూడా ఈ జట్టులో ఉన్నారు. వికెట్ కీపింగ్ బాధ్యతలను జగదీశన్ నిర్వర్తించనున్నాడు. గోవా బ్యాటర్ అభినవ్ తేజ్రానా కూడా జట్టులో స్థానం సంపాదించాడు.

గత ఎడిషన్‌లో సౌత్ జోన్ ఫైనల్‌కు చేరి సెంట్రల్ జోన్ చేతిలో ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఈ కారణంగా ఈసారి నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. ఆగస్టు 30న బీసీసీఐ సీఓఈ గ్రౌండ్ 2లో జరిగే సెమీఫైనల్ మ్యాచ్‌లో క్వార్టర్‌ఫైనల్ 2 విజేతతో సౌత్ జోన్ తలపడుతుంది.

బౌలింగ్ విభాగం కూడా పటిష్ఠంగా ఉంది. స్పిన్ బాధ్యతలను లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్, లెగ్ స్పిన్నర్ శ్రేయాస్ గోపాల్ పంచుకోనున్నారు. పేస్ విభాగంలో కె. సాయితేజ, త్రిపురాన విజయ్, విద్వత్ కావరప్ప, ఎం.డి. నిదీశ్ ఉన్నారు.

**సౌత్ జోన్ జట్టు:**

ఎన్. తిలక్ వర్మ (కెప్టెన్), రికీ భుయ్ (వైస్ కెప్టెన్), అభినవ్ తేజ్రానా, షేక్ రషీద్, కె.ఎం. హిమతేజ, ఆర్. స్మరణ్, ఎన్. జగదీశన్ (వికెట్ కీపర్), కరుణ్ నాయర్, తనయ్ త్యాగరాజన్, శ్రేయస్ గోపాల్, కె. సాయితేజ, టి. విజయ్, విద్వత్ కావరప్ప, హెచ్. అమన్ ఖాన్, ఎం.డి. నిదీశ్.

# నా లక్ష్యం అది కాదు.. ఇప్పుడు కేవలం దాని కోసమే ఆడుతున్నా: భువనేశ్వర్ కుమార్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ తన కెరీర్, భవిష్యత్తు ప్రణాళికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. జాతీయ జట్టులోకి తిరిగి రావాలన్నదే ఇప్పుడు తన ప్రధాన లక్ష్యం కాదని, కేవలం ఆటపై ఉన్న ప్రేమతోనే క్రికెట్ కొనసాగిస్తున్నానని స్పష్టం చేశాడు. భారత జట్టుకు దూరమైన జీవితంతో తాను సంతృప్తిగా ఉన్నానని, ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆటను ఆస్వాదిస్తున్నానని తెలిపాడు. 36 ఏళ్ల భువనేశ్వర్ చివరిసారిగా 2022లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఇప్పటివరకు 21 టెస్టులు, 121 వన్డేలు, 87 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తరఫున ఆడి, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. తాజాగా ఆర్‌సీబీ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. "దేశం తరఫున ఆడాలన్న నా కల ఇప్పటికే నెరవేరింది. ఇప్పుడు మళ్లీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. మళ్లీ అవకాశం వస్తే గొప్ప విషయమే. కానీ, దానికోసం ఒత్తిడికి గురికావడం లేదు. ప్రస్తుతం నేను ఆడుతున్నది కేవలం ఆటపై ఉన్న ఇష్టం, క్రమశిక్షణతోనే" అని వివరించాడు. ఐపీఎల్, దేశవాళీ క్రికెట్, యూపీ టీ20 లీగ్‌లలో ఆడుతూ ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటున్నట్లు తెలిపాడు. జట్టులో చోటు కోల్పోయినందుకు తనకెలాంటి పశ్చాత్తాపం లేదని, ఈ విషయంలో తన కుటుంబం అందించిన మద్దతు ఎంతో కీలకమని భువీ పేర్కొన్నాడు. "ఇంట్లో మేము క్రికెట్ గురించి అస్సలు మాట్లాడుకోము. జట్టులో నా స్థానం గురించి, నన్ను ఎందుకు ఎంపిక చేయలేదనే చర్చలు ఉండవు. క్రీడల్లో తరాల మార్పు సహజమని నేను అర్థం చేసుకున్నాను. ఈ పరిస్థితిని ఎదుర్కొన్న మొదటి ఆటగాడిని నేను కాదు, చివరివాడినీ కాను. అందుకే నేను ఉన్న స్థితిలో సంతోషంగా ఉన్నాను" అని అన్నాడు. భారత్‌లో ఫాస్ట్ బౌలింగ్ విప్లవానికి ఐపీఎల్‌తో పాటు మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ, మాజీ కోచ్ రవిశాస్త్రిలే కారణమని భువనేశ్వర్ ప్రశంసించాడు. "భారత పేస్ దళాన్ని నిర్మించాలనే స్పష్టమైన విజన్‌తో కోహ్లీ, శాస్త్రి పనిచేశారు. విదేశీ పర్యటనలకు ముందు స్వదేశంలో కూడా పేసర్లకు అనుకూలించే పిచ్‌లను తయారు చేయించి మమ్మల్ని సిద్ధం చేశారు. అలాంటి చిన్న నిర్ణయాలే పెద్ద మార్పులకు కారణమయ్యాయి" అని గుర్తుచేసుకున్నాడు. తన చిన్నతనంలో మీరట్‌లోని అకాడమీలో సీనియర్ అయిన ప్రవీణ్ కుమార్ బౌలింగ్‌ను చూసి ఎంతో నేర్చుకున్నానని, అతని బౌలింగ్ శైలి తనపై చాలా ప్రభావం చూపిందని భువనేశ్వర్ చెప్పుకొచ్చాడు.

# ఆపుకుందామన్నా ఆపుకోలేకపోయిన జాన్వీ చివరికిలా

## దిశా పటానీ: ఎల్లే కవర్‌పై చంపు తోంది







టాలీవుడ్ లో దేవర, పెద్ది సినిమాల తర్వాత కోలీవుడ్ పై దృష్టి సారించింది జాన్వీకపూర్. అక్కడ తన మొదటి ప్రాజెక్ట్ ప్రకటన ఉంటుందని ప్రచారం సాగుతోంది. మరోవైపు దేశవ్యాప్తంగా ఉన్న తన ఫ్యాన్స్ కోసం జాన్వీ ట్రీట్ ఆగడం లేదు. అందాల భామ జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో కావాల్సినంతా వినోదం పంచుతున్నారు. తన లేటెస్ట్ ఫోటోషూట్లు, అవుట్‌ఫిట్లతో అభిమానులను నిరంతరం అలరించే ఈ బ్యూటీ ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన కొన్ని క్యూట్ అండ్ స్టైలిష్ ఫోటోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ఈ ఫోటోలను షేర్ చేస్తూ జాన్వీ కపూర్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ సరదా క్యాప్షన్ రాసుకొచ్చారు. నేను ఆపుకుందామనే ప్రయత్నించాను.. కానీ ఈ పిక్స్ చాలా క్యూట్‌గా ఉండటంతో పోస్ట్ చేయకుండా ఉండలేకపోయాను! అంటూ దిష్టి తగలకుండా దిష్టి కన్ను ఎమోజీని క్యాప్షన్‌గా జోడించారు. ముఖ్యంగా ఈ ఫోటోషూట్ లో ఆకుపచ్చ రంగు దుస్తుల్లో జాన్వీ మెరిసిపోతున్న తీరు చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు.

ఈ పోస్ట్ చూసిన సినీ సెలబ్రిటీలతో పాటు లక్షలాది మంది అభిమానులు కామెంట్ల రూపంలో తమ అభిమానాన్ని కురిపిస్తున్నారు. ప్రముఖ నటి సోనమ్ బాజ్వాతో పాటు పలువురు డిజైనర్లు, శ్రేయోభిలాషులు జాన్వీ అందాన్ని ప్రశంసిస్తూ కామెంట్లు పెట్టారు. బార్బీ డాల్‌లా ఎంతో క్యూట్‌గా, ఎలిగెంట్‌గా ఉన్నారు! అంటూ ఫ్యాన్స్ క్యూట్ జాన్వీ లుక్స్‌పై ఈలలు వేస్తున్నారు.

మరోవైపు కామెంట్ సెక్షన్‌లో అభిమానుల హడావుడి మామూలుగా లేదు. చాలామంది నెటిజన్లు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఈ చిన్నారికి ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ సుదీర్ఘమైన మెసేజ్‌లు పోస్ట్ చేశారు. అలాగే పాపులర్ ఫ్యాన్స్ గ్రూప్స్ లలో కూడా పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తూ ఈ పోస్ట్‌ను సోషల్ మీడియాలో ట్రెండ్ చేయడానికి పోటీ పడ్డారు.

ప్రస్తుతం ఈ పోస్ట్‌కి 4 లక్షలకు పైగా లైకులు, వేల సంఖ్యలో కామెంట్లు వచ్చి చేరుతుండటంతో జాన్వీ కపూర్ పిక్స్ నెట్టింట కాక రేపుతున్నాయి. సినిమా ఆఫర్లతో ఎంత బిజీగా ఉన్నా.. ఇలాంటి సరదా ఫోటోలతో అభిమానులకు నిరంతరం టచ్‌లో ఉండటం జాన్వీకే చెల్లిందని కామెంట్స్ చేస్తున్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే పెద్ది తర్వాత జాన్వీ కపూర్ నటించే సినిమాలకు సంబంధించిన వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965